వాస్తవాలు పలుకు DD9 TGTEL/26/A2635

వార

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 117 | 06-09-2026 | ఆదివారం | పేజీలు: 10 | వెల: 3/-

గులాబీ గర్జన.. బైక్ ర్యాలీతో కదం తొక్కిన బి.ఆర్.ఎస్ శ్రేణులు..



7



తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా?

- కేసీఆర్ రాజీనామాకు కాంగ్రెస్ నేతల డిమాండ్‌పై కేటీఆర్ ఆగ్రహం
- తెలంగాణ తెచ్చిన నాయకుడు రాజీనామా చేయాలా? అని ప్రశ్న
- కరీంనగర్‌లో యువ సమరభేరి కార్యక్రమంలో ప్రసంగం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలే బర్తరఫ్ చేస్తారన్న కేటీఆర్
- ఒక్క మంత్రిని తొలగించడం పరిష్కారం కాదని వ్యాఖ్య
- నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందని విమర్శ
- ప్రభుత్వ పాలనలో విజన్ కంటే విధ్వంసమే ఉందని ఆరోపణ
- ఉద్యోగాలు అడిగితే నిరుద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని మండిపాటు
- నోటిఫికేషన్ల స్థానంలో లూటిఫికేషన్ చేస్తున్నారని ఎద్దేవా
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న కేటీఆర్

హైదరాబాద్, (డీడీ9 వార్త):

కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఆయన రాజీనామా చేయాలా? అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. కరీంనగర్‌లోని డా. బి.ఆర్. అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన యువ సమరభేరి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేస్తారు

ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు దగ్గరలో ఉన్నాయని కేటీఆర్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం మిగతా 2లో..

రెండేళ్లు సహకరించండి ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తా

పీఆర్సీ, ఇంక్రిమెంట్ల సమస్యల పరిష్కారానికి హామీ

విద్యా వ్యవస్థను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలని సీఎం పిలుపు

ఉపాధ్యాయులే విద్యా సంస్కరణలకు కథానాయకులని వ్యాఖ్య

రెండేళ్లలో అడక్కుండానే సమస్యలు పరిష్కరిస్తానని వెల్లడి

ఉపాధ్యాయులు ధర్నాలకు దిగడం తప్పుడు సంకేతమని వ్యాఖ్య

బదిలీలు, పదోన్నతులు, 317 జీవో సమస్యలు పరిష్కరించామని వెల్లడి

ప్రభుత్వ పాఠశాలల్లో 80 వేల అడ్మిషన్లు పెరిగాయని ప్రకటన

పాలిటెక్నిక్‌లో థియరీతోపాటు కార్పొరేట్ ఇంటర్న్‌షిప్‌లు

నైపుణ్య విద్యతో ప్రపంచ ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచన

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6 వేల కోట్లు చెల్లించామని వెల్లడి



హైదరాబాద్, (డీడీ9 వార్త):

రెండేళ్లపాటు సహకరించి ప్రభుత్వానికి వెసులుబాటు కల్పిస్తే ఉపాధ్యాయుల పీఆర్సీ, ఇంక్రిమెంట్లతో పాటు అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ విద్యా వ్యవస్థను దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టే దిశగా సంస్కరణలు చేపడుతున్నామని, ఈ ప్రక్రియలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు.

ఉపాధ్యాయులు వీధుల్లోకి వచ్చి ధర్నాలు చేయడం ప్రభుత్వానికి, రాష్ట్రానికి శుభసూచకం కాదని రేవంత్‌రెడ్డి అన్నారు. ‘‘ముఖ్యమంత్రిగా విజ్ఞప్తి చేస్తున్నా.. రెండేళ్లు సమయం ఇవ్వండి. ఉపాధ్యాయులు, లెక్చరర్లకు అణాపైసా కష్టం రానివ్వను. పీఆర్సీ, ఇంక్రిమెంట్లతో పాటు ఇతర సమస్యల్లోనూ ఇబ్బంది రానివ్వను’’ అని స్పష్టం చేశారు. సలహాదారు కే. కేశవరావుతో కూర్చొని సమస్యలపై చర్చించాలని సూచించారు.

ఉపాధ్యాయులదే కీలక పాత్ర

తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టడంలో ఉపాధ్యాయులే కథానాయకులని సీఎం అన్నారు. ఇంట్లో తమ పిల్లల భవిష్యత్తు గురించి ఏ విధంగా శ్రద్ధ తీసుకుంటారో, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విషయంలోనూ అదే శ్రద్ధ చూపాలని కోరారు. ఉపాధ్యాయులపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు.

గత ప్రభుత్వంలో పదేళ్లపాటు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ పరిస్థితి నుంచి విద్యా రంగాన్ని వికాసం వైపు తీసుకెళ్లే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి మిగతా 2లో..

సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమే

ఆమెను కాపాడేందుకు ప్రయత్నించామన్న టీపీసీసీ చీఫ్

బర్తరఫ్ విషయంలో హైకమాండ్ అంగీకరించలేదని వెల్లడి

ఢిల్లీ పరిణామాలపై మీడియా చిట్‌చాట్‌లో మహేశ్ కీలక వ్యాఖ్యలు

సురేఖ విషయంలో అందరం తమ వంతు ప్రయత్నం చేశామని వెల్లడి

ఇప్పట్లో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఉండదని స్పష్టీకరణ

ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదన్న మహేశ్

కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశాలపైనే చర్చ జరిగిందని వెల్లడి

మంత్రివర్గ విస్తరణ నిర్ణయం సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టమేనని వ్యాఖ్య



హైదరాబాద్, (డీడీ9 వార్త):

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమేనని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ మిగతా 2లో..

తెలంగాణలో కేబినెట్ విస్తరణ ఎప్పుడు..? ఎవరికీ ఛాన్స్..?

కేబినెట్‌లో మూడుకు పెరిగిన ఖాళీల సంఖ్య..

అసెంబ్లీ ముగిసిన తర్వాత కేబినెట్ గురించి ఆలోచిస్తారా..?..

కేబినెట్ విస్తరణకు అధిష్టానం నుంచి అనుమతి..?..

బీసీ సామాజికవర్గం నుంచి ముందువరుసలో ఆది శ్రీనివాస్..

రెడ్డి కోటాలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేరు..

పరిశీలనలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు కూడా..

లంబాడాలకు ఇచ్చేట్టు అయితే రేసులో బాలునాయక్..?..



హైదరాబాద్, (డీడీ9 వార్త):

తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో త్వరలోనే కేబినెట్ విస్తరణ ఉండొచ్చన్న ఊహాగానాలు పెరిగిపోయాయి. ఇన్నాళ్లు కేబినెట్‌లో మిగతా 2లో..



22ఏ భూములపై 30 శాతం కమీషన్

లక్షలాది ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలోకి

పేద, మధ్యతరగతి భూ యజమానులు అల్లాడుతున్నారని వ్యాఖ్య

భూముల తొలగింపునకు 30 శాతం కమీషన్ అడుగుతున్నారని ఆరోపణ

రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా క్షీణించిందని రామచందర్‌రావు విమర్శ

వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్

కేసీఆర్ కుటుంబం దోచుకుందని రామచందర్‌రావు విమర్శ

రేవంత్‌రెడ్డి బ్రదర్స్ దోచుకుంటున్నారని తీవ్ర ఆరోపణ

22ఏ జాబితా నుంచి భూములు తక్షణమే తొలగించాలని డిమాండ్

లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని బీజేపీ హెచ్చరిక

హైదరాబాద్, (డీడీ9 వార్త):

భూభారతి, 22ఏ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో లక్షలాది ఎకరాల భూమిని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

భూముల తొలగింపునకు కమీషన్

22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తొలగించాలంటే 30 శాతం కమీషన్ అడుగుతున్నారని రామచందర్‌రావు ఆరోపించారు. రెవెన్యూ వ్యవస్థ మొత్తం క్షీణించిపోయిందని విమర్శించారు. ఈ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని మిగతా 3లో..



విద్యార్థులను ఫోన్‌కు దూరంగా ఉంచాలి..

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

విద్యార్థుల దైనందిన జీవితంపైనా టీచర్లు శ్రద్ధ చూపాలి

ఉమ్మడి కుటుంబాలు తగ్గుతున్న వేళ ఉపాధ్యాయులదే కీలక పాత్ర

పిల్లల అలవాట్లను ఎప్పటికప్పుడు గమనించాలి

మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులను కాపాడాలి

స్క్రీన్ సమయాన్ని తగ్గించేందుకు క్రీడలను ప్రోత్సహించాలి

కొత్త సాంకేతికతలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

ప్రతి చిన్నారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

తరగతి గదితో పాటు సమాజంపై అవగాహన కల్పించాలి

సిలబస్‌తో పాటు నైతిక విలువలను నేర్పాలి

హైదరాబాద్, (డీడీ9 వార్త):

విద్యార్థులకు చదువుతో పాటు *క్రీడలు, సృజనాత్మకతపై ఆసక్తిని పెంపొందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ* ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలను ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు పరిమితం చేయకుండా వారి ప్రతిభను వెలికితీసేలా ప్రోత్సహించాలని చెప్పారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయస్థాయిలో మిగతా 3లో..

22ఏ జాబితా నుంచి ప్రజల ఇళ్లను తొలగించాలి

సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీపై ఎంపీ రఘునందన్‌రావు ఆగ్రహం

1500 ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడంపై ప్రజల ఆవేదన

ప్రభుత్వ అనుమతులతోనే కాలనీ నిర్మాణం జరిగిందన్న ఎంపీ

55 ఎకరాల్లో సింఫనీ హోమ్స్ నిర్మించారని వెల్లడి

12 ఏళ్ల క్రితం నిర్మించిన కాలనీని ఎలా చేర్చారన్న ప్రశ్న

రుణాలు తీసుకుని కట్టుకున్న ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై ఆగ్రహం

రేవంత్‌రెడ్డి ఇల్లు 22ఏ జాబితా నుంచి ఎలా తొలగించారని నిలదీత

అధికారుల తప్పులకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్న ఎంపీ

బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని రఘునందన్‌రావు డిమాండ్



వెయ్యి రోజుల పాలనలో వెయ్యి అబద్ధాలు

కాంగ్రెస్ పాలనలో రైతులను రాబందుల్లా పీక్కుతింటున్నారన్న హరీశ్‌రావు

దుబ్బాకలో 'రైతు పొలికేక' కార్యక్రమంలో మాజీ మంత్రి విమర్శలు

తెలంగాణ కోసం పోరాడిన తాము మళ్లీ రోడ్లపైకి వచ్చామన్న వ్యాఖ్య

24 గంటల విద్యుత్ ఐదారు గంటలకు పడిపోయిందని ఆరోపణ

ఉచిత కరెంట్ కాస్తా ఉత్త కరెంట్‌గా మారిందని ఎద్దేవా

మూడేళ్లలో రూ.29 వేల కోట్ల రైతుబంధు ఎగ్గొట్టారన్న ఆరోపణ

రైతు బీమాను కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేసిందని విమర్శ

కాళేశ్వరం ప్రాజెక్టును రేవంత్ సర్కారు నిర్లక్ష్యం చేసిందన్న హరీశ్‌రావు


ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. రేవంత్ తెచ్చిన కరవు అని వ్యాఖ్య

రైతుబంధు మళ్లీ రావాలంటే కేసీఆర్ అధికారంలోకి రావాలన్న హరీశ్‌రావు



హైదరాబాద్, (డీడీ9 వార్త):


తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులుగా రాబందు, రాక్షస పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను రాబందుల్లా పీక్కుతింటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనల్లో మిగతా 2లో..



ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు 8 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

- కేరళలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం
- త్రిశూర్ జిల్లాలో విషాదకర ఘటన
- హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ప్రమాద ధాటికి నుజ్జునుజ్జయిన కారు
- కారులో ఉన్న ఎనిమిది మంది మృత్యువాత
- ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరి మృతి
- మృతులంతా తమిళనాడు విద్యార్థులుగా గుర్తింపు

2



కేసీఆర్ రాజీనామా చేయాలి

- ప్రజలకు అందబాటులో లేనప్పుడు ఎమ్మెల్యేగా కొనసాగడం ఎందుకు?
- ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించడం లేదని మంత్రి విమర్శ
- కేసీఆర్ రాజీనామా డిమాండ్‌తో 6న ఇందిరాపార్క్‌లో మహా ధర్నా
- మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు
- హైదరాబాద్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రుల ప్రసంగం
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని ఆరోపణ

2

అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?

- ప్రైవేట్ స్కూళ్లు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయని కవిత ఆగ్రహం
- స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపాటు
- విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా రేవంత్ మౌనం వహిస్తున్నారన్న కవిత



2

తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా?

మొదటిపేజీ తరువాయి



లేదని విమర్శించారు.

నిరుద్యోగులను నిండా ముంచారు

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు సరైన అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఉద్యోగాలు అడిగితే ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు.

విజన్ కాదు.. విధ్వంసం

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విజన్ కాకుండా విధ్వంసమే కనిపిస్తోందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్తు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన దిశానిర్దేశంతో ముందుకు సాగడం లేదని ఆరోపించారు.

నోటిఫికేషన్లపై ఎద్దేవా

ఉద్యోగ నోటిఫికేషన్ల గురించి అడిగితే ప్రభుత్వం లూటిఫికేషన్ చేస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యువత, నిరుద్యోగుల తరపున బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమే

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. సురేఖను కాపాడేందుకు తాము తీవ్రంగా ప్రయత్నించామని, ఆమె విషయంలో అందరం తమవంతు ప్రయత్నం చేశామని చెప్పారు. అయితే ఈ విషయంలో హైకమాండ్ అంగీకరించలేదని వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన పరిణామాలపై శనివారం నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో మహేశ్ గౌడ్ మాట్లాడారు.

కేబినెట్ విస్తరణపై స్పష్టత

ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశాలపైనే చర్చ జరిగినట్లు తెలిపారు. కేబినెట్ విస్తరణ ఎప్పుడు చేపట్టాలనేది సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టమని పేర్కొన్నారు.

మంత్రి పదవిపై సమాచారం లేదు

తనకు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారంపై ఎలాంటి సమాచారం లేదని మహేశ్ గౌడ్ తెలిపారు. హైకమాండ్ నుంచి కేబినెట్ విస్తరణకు సంబంధించి ఎలాంటి సమాచారం రాలేదని స్పష్టం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆశయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని మహేశ్ గౌడ్ అన్నారు. కుల సర్వేను శాస్త్రీయంగా నిర్వహించామని తెలిపారు.

బీసీ హక్కుల కోసం గర్జన

బీసీ హక్కుల కోసం రాబోయే వంద రోజుల పాటు దేశవ్యాప్తంగా 'బీసీ హక్కుల గర్జన' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. బీసీల హక్కుల కోసం చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు 8 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

- కేరళలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం
- త్రిశూర్ జిల్లాలో విషాదకర ఘటన
- హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ప్రమాద ధాటికి నుజ్జునుజ్జయిన కారు
- కారులో ఉన్న ఎనిమిది మంది మృత్యువాత
- ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరి మృతి
- మృతులంతా తమిళనాడు విద్యార్థులుగా గుర్తింపు
- అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానం
- ప్రమాదంపై కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

కేరళ, (డీడీ9 వార్త):

కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. త్రిశూర్ జిల్లాలో హైవేపై ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఎనిమిది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందారు. కైపమంగళం ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది.

లారీని ఢీకొన్న కారు

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు గురువాయూర్ నుంచి కొడుంగళూరు వెళ్తోంది. కైపమంగళం ప్రాంతంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో మొత్తం ఎనిమిది మంది ఉన్నారు.

ఏడుగురు అక్కడికక్కడే

ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా దెబ్బతిన్న కారులో చిక్కుకున్న వారిని అతికష్టమ్మీద బయటకు తీశారు. అయితే అప్పటికే ఏడుగురు మృతిచెందినట్లు గుర్తించారు. తీవ్ర గాయాల పాలైన మరో వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

తమిళనాడు విద్యార్థులు

మృతులంతా తమిళనాడులోని దిండిగుల్ ప్రాంతంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. మృతుల పేర్లు, ఇతర వ్యక్తిగత వివరాలు ఇంకా వెల్లడించలేదు.

అతివేగమే కారణమా?

కారు అతివేగంగా ప్రయాణించడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో జాతీయ రహదారిపై మరమ్మతు పనులు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల గుర్తింపును నిర్ధరించే ప్రక్రియ కొనసాగుతోంది. ఘటనపై కేరళ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?

- ప్రైవేట్ స్కూళ్లు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయని కవిత ఆగ్రహం
- స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపాటు
- విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా రేవంత్ మౌనం వహిస్తున్నారన్న కవిత

హైదరాబాద్, (డీడీ9 వార్త):

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఫీజుల దోపిడీపై కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్‌ను తీసుకొస్తామని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని, దానికి సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు రెండేళ్లుగా కేబినెట్ దాటి బయటకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. స్వయంగా విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి... పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు.

ప్రభుత్వ భూముల్లో నడిచే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సైతం ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచినా సర్కార్ మౌనంగా ఉండటం కార్పొరేట్ విద్యావ్యాపారులకు బాసటగా నిలవడమేనని కవిత ఆరోపించారు. 1994 నాటి జీవో ప్రకారం వార్షిక ఫీజుల పెంపు 5 శాతానికి మించకూడదన్న స్పష్టమైన నిబంధన ఉన్నా దానిని పక్కనబెట్టి, విద్యా వ్యవస్థను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. రాబోయే శాసనసభ సమావేశాల్లోనే తక్షణమే పాఠశాల ఫీజుల నియంత్రణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రెండేళ్లు సహకరించండి ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తా

మొదటిపేజీ తరువాయి



పచ్చిన తర్వాత ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామని, జీవో 317 కింద తలెత్తిన సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించామని చెప్పారు.

80 వేల అడ్మిషన్లు పెరిగాయి

ప్రభుత్వ పాఠశాలల్లో గత రెండేళ్లలో 80 వేలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు పెరగడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని సీఎం అన్నారు. విద్యా రంగంలో జాతీయ స్థాయిలో 28వ స్థానంలో ఉన్న తెలంగాణ 17వ స్థానానికి చేరుకోవడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉత్తమ విధానాలను అధ్యయనం చేసేందుకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు ఉపాధ్యాయులను విదేశాలకు పంపించామని తెలిపారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్ పాలసీ తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ విధాన రూపకల్పనలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు.

పాలిటెక్నిక్‌లో కొత్త విధానం

మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యా విధానంలో నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చే ప్రయత్నంపై ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం జరిగిందని అన్నారు.

పాలిటెక్నిక్‌లో రెండేళ్లు థియరీ, మూడో ఏడాది కార్పొరేట్ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. ఇంటర్న్‌షిప్ సమయంలో కార్పొరేట్ సంస్థలు రూ.9 వేల వరకు స్టయిఫండ్ ఇచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులకు విదేశాల్లో మాస్టర్స్ చదివేందుకు వీలుగా డిగ్రీ పట్టా అందించే విధంగా మార్పులు చేశామని పేర్కొన్నారు.పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులు ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో చేరే అవకాశంలో ఎలాంటి మార్పు ఉండదని సీఎం స్పష్టం చేశారు.లెక్చరర్ల సర్వీస్ రూల్స్ విషయంలోనూ ఎలాంటి నష్టం జరగదని తెలిపారు.

నైపుణ్యాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు జ్ఞానం, కమ్యూనికేషన్‌తో కూడిన విద్య అందించి, ఆ తర్వాత నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. సాంకేతిక నైపుణ్యాలు ఉన్నవారికి ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో నైపుణ్యాలు ఉన్నవారికి డిమాండ్ ఉందన్నారు.

స్కిల్స్ తర్వాత ఇన్నొవేషన్, ఎంప్లాయ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ఏరోస్పేస్ రంగంలోని స్టార్టప్ సంస్థ స్కైరూట్‌ను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ఇన్నొవేషన్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించేందుకు ఉపాధ్యాయులు రెండేళ్లు కేంద్రీకృతంగా పనిచేయాలని కోరారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై వెల్లడి

30 నుంచి 35 ఏళ్లపాటు ప్రభుత్వ సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకుండా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దాదాపు రూ.8 వేల కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెండింగ్‌లో ఉన్నాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందుబాటులో ఉన్న నిధులను సమీకరించి వంద రోజుల్లో రూ.6 వేల కోట్లు చెల్లించామని తెలిపారు.

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాజీ రాష్ట్రపతి, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి సీఎం పుష్పాంజలి ఘటించి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణలో కేబినెట్ విస్తరణ ఎప్పుడు..? ఎవరికీ ఛాన్స్..?

మొదటిపేజీ తరువాయి

రెండు పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు సురేఖను తప్పించడంతో ఖాళీల సంఖ్య మూడుకు పెరిగింది. మరి ఈ మూడు మంత్రి పదవులను ఎప్పుడూ భర్తీ చేస్తారనే చర్చ తెరపైకి వచ్చింది. కేబినేట్ విస్తరణ ఇప్పట్లో ఉంటుందా..? ఆ అవకాశమే ఉండదా..? అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లోనే కాకుండా తెలంగాణలో కూడా నడుస్తోంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత.. కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించే అవకాశముందట. ఇప్పటికే ఈ విషయంలో అధిష్టానం నుంచి అనుమతి తీసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాలంటున్నాయి. ముహూర్తం ఫిక్స్ చేసుకోవాల్సింది సీఎం రేవంతే. కేబినెట్ విస్తరణలో బీసీ సామాజికవర్గానికి అవకాశం దక్కడం పక్కానే. ఎందుకంటే బీసీ మంత్రి అయిన కొండా సురేఖను పదవి నుంచి తప్పించినందున... బీసీ సామాజికవర్గం నుంచి ఒకరిని కేబినెట్‌లోకి తీసుకోవడం ఖాయమే. మరి ఛాన్స్ దక్కేదెవరికి..?

ఆశావహులు అనేకమంది ఉన్నారు. బీసీ సామాజికవర్గం నుంచి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముందు వరుసలో ఉన్నారట. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేరు కూడా పరిశీలనలో ఉందట. కేబినెట్ నుంచి తప్పించింది మహిళను కదా... ఆ ప్లేస్‌లో మహిళనే తీసుకోవాలి కదా..? అనే చర్చకు స్పేస్ ఇవ్వకుండా ముగ్గురు మహిళా నేతలకు పదవులు ఇచ్చేశారు. ఇక మిగిలిన రెండు మంత్రి పదవులను ఎలా భర్తీ చేయాలి..? రెడ్డి సామాజిక వర్గానికి ఒక పదవి ఇవ్వడం పక్కా. ఆ కోటాలో నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారట. పైగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఒక్క మంత్రి కూడా లేరు. దీంతో ఆ జిల్లాకు అవకాశం ఇవ్వాలనే ఈక్వేషన్ ఉందట. మరో వ్యక్తి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. చాలారోజులుగా పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు రాజగోపాల్ రెడ్డి. ఆయన్ని కేబినేట్‌లోకి తీసుకున్నాక కూడా పంథా మార్చకపోతే పరిస్థితి ఏంటనే చర్చ జరుగుతోందట. రాజగోపాల్ రెడ్డి తన పంథాలోనే కంటిన్యూ అయితే పార్టీకి నష్టం జరిగే అవకాశం లేకపోలేదనే మాటలు వినిపిస్తున్నాయి. పైగా కోమటిరెడ్డి కుటుంబంలో ఇద్దరికి ఛాన్స్ ఇవ్వడంపై అధిష్టానం కూడా భిన్నరకాలుగా చర్చిస్తుంది.

మరో మంత్రి పదవి STల నుంచి లంబాడా సామాజికవర్గానికి ఇవ్వాలనే చర్చ కాంగ్రెస్‌లో జరుగుతోందట. లంబాడా వర్గానికి ఇచ్చేట్టు అయితే... దేవరకొండ MLA బాలు నాయక్ రేసులో ఉంటారని కాంగ్రెస్ వర్గాల సమాచారం. ఒకవేళ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఇచ్చి, బాలు నాయక్‌కు కూడా మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే... ఇద్దరూ ఒకే జిల్లాకు చెందినవారు అవుతారు. దీనిని కూడా పార్టీ పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికే ఇద్దరు మంత్రులు రెడ్డి మంత్రులున్నారు. మళ్ళీ మూడో రెడ్డికి అవకాశం ఇస్తారా..? మరోవైపు బాలు నాయక్‌ను... డిప్యూటీ స్పీకర్ చేయాలనే చర్చ కూడా వచ్చిందట. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించారు కాబట్టి ఆ జిల్లాకు చెందిన లంబాడాకు అవకాశం ఇస్తారా..? అనే చర్చ కూడా నడుస్తోంది. అలాగైతే రామచంద్రు నాయక్ పేరును పరిశీలించాల్సి ఉంటుంది. ఆయనపై అధిష్టానం ఇప్పటికే సీరియస్‌గా ఉంది. డిప్యూటీ స్పీకర్‌గా అభ్యర్థిత్వం ప్రకటించినా... పదవి తీసుకోకపోవడంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సీరియస్‌గా ఉన్నారట. మరి లంబాడా కోటాలో బాలు నాయక్ మంత్రి అవుతారా..? లేదంటే రామచంద్ర నాయక్‌కు అవకాశం దక్కుతుందా..? అనే చర్చ కాంగ్రెస్‌లో గట్టిగానే నడుస్తోందట. మరి సీఎం రేవంత్ రెడ్డి మనసులో ఏముంది..? ఆయన ఎవరిని ఎంపిక చేసుకుంటారు..? అనేది త్వరలో క్లారిటీ రావొచ్చంటున్నాయి గాంధీభవన్ వర్గాలు.

వెయ్యి రోజుల పాలనలో వెయ్యి అబద్ధాలు

మొదటిపేజీ తరువాయి



భాగంగా శనివారం దుబ్బాక నియోజకవర్గంలోని హబ్సీపూర్ క్రాసింగ్ వద్ద నిర్వహించిన 'రైతు పొలికేక' కార్యక్రమంలో హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

మళ్లీ రోడ్లపైకి రావాల్సి వచ్చింది

తెలంగాణ కోసం గతంలో ఉద్యమం చేసిన తాము.. సీఎం రేవంత్‌రెడ్డి పాలన కారణంగా నేడు మళ్లీ రోడ్లపైకి రావాల్సి వస్తోందని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా కాస్తా ఐదారు గంటలకు పడిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోసం రైతులు ఎదురు చూసే పరిస్థితి ఉండేదా? అని ప్రశ్నించారు.

ఉచిత కరెంట్‌పై ఎద్దేవా

కాంగ్రెస్ చెప్పిన పాత రోజులు మళ్లీ వచ్చాయని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఉచిత కరెంట్ కాస్తా ఉత్త కరెంట్‌గా మారిందంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

రైతుబంధు నిలిపివేశారని ఆరోపణ

కరోనా సమయంలోనూ రైతుబంధు పథకం ఆగలేదని హరీశ్‌రావు గుర్తు చేశారు. రైతులపై కేసీఆర్‌కు ప్రేమ ఉండేదని.. సీఎం రేవంత్‌రెడ్డికి ఏమైందని ప్రశ్నించారు. ఉన్న రైతుబంధు పథకానికి ఎసరు పెట్టారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ మూడేళ్లలో రూ.29 వేల కోట్ల రైతుబంధు నిధులను ఎగ్గొట్టిందని పేర్కొన్నారు.

రైతు బీమా, ఎరువులపై విమర్శలు

రైతు బీమాను బంద్ చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. యాప్‌లో బుక్ చేసినా 15 రోజుల వరకు డీఏపీ ఇవ్వడం లేదన్నారు. షాపులో లేని యూరియా యాప్‌లోకి ఎలా వస్తుందని ప్రశ్నించారు. యూరియా ధరలను బీజేపీ ప్రభుత్వం పెంచిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు రైతుల ఉసురు పోసుకుంటున్నాయని మండిపడ్డారు.

కాళేశ్వరంపై తీవ్ర ఆరోపణలు

ఉమ్మడి మెదక్ జిల్లాల్లో ఈ మూడేళ్లలో ఒక్క ఎకరా భూసేకరణ చేయలేదని, జానెడు కాలువ కూడా తవ్వలేదని హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మేడిగడ్డ వద్ద చిన్న మరమ్మతు చేయాల్సి ఉన్నా పట్టించుకోకుండా ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చారని విమర్శించారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదని.. రేవంత్‌రెడ్డి తెచ్చిన కరవు అని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ అధికారంలోకి రావాలన్న హరీశ్‌రావు

మేడిగడ్డ వద్ద 44 వేల క్యూసెక్కుల నీరు పారుతోందని హరీశ్‌రావు తెలిపారు. మోటార్లు ఆన్ చేస్తే మల్లన్నసాగర్‌కు నీరు వస్తుందని చెప్పారు. వెయ్యి రోజుల పాలనలో వెయ్యి అబద్ధాలు, వెయ్యి ఓట్లు, భూ కబ్జాలు తప్ప మరేమీ లేవని ఆరోపించారు. రైతుబంధు గతంలో మాదిరిగా రావాలంటే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావాలని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కేసీఆర్ రాజీనామా చేయాలి

- ప్రజలకు అందుబాటులో లేనప్పుడు ఎమ్మెల్యేగా కొనసాగడం ఎందుకు?
- ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించడం లేదని మంత్రి విమర్శ
- కేసీఆర్ రాజీనామా డిమాండ్‌తో 6న ఇందిరాపార్క్‌లో మహా ధర్నా
- మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు
- హైదరాబాద్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రుల ప్రసంగం
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని ఆరోపణ
- పదేళ్లలో వందేళ్ల విధ్వంసం జరిగిందని పొన్నం ప్రభాకర్ వ్యాఖ్య
- ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ అసెంబ్లీకి హాజరుకావడం లేదని విమర్శ
- నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేరని మంత్రి ఆరోపణ
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్న పొన్నం

హైదరాబాద్, (డీడీ9 వార్త):

కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి తన బాధ్యతలను నిర్వర్తించనప్పుడు ఎమ్మెల్యే పదవిలో కొనసాగడం ఎందుకని ప్రశ్నించారు. కేసీఆర్ రాజీనామా డిమాండ్‌తో ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సన్నాహక సమావేశంలో మంత్రుల ప్రసంగం

మహా ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు మాట్లాడారు. కేసీఆర్ ఎమ్మెల్యేగా తన బాధ్యతలను నిర్వర్తించడం లేదని పొన్నం విమర్శించారు.

అసెంబ్లీకి హాజరుకావడం లేదని ఆరోపణ

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. పదేళ్ల పాలనలో 100 ఏళ్ల విధ్వంసం జరిగిందని విమర్శించారు. వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడం లేదని అన్నారు.

ప్రజలకు అందుబాటులో లేరని విమర్శ

తన నియోజకవర్గ ప్రజలకు కూడా కేసీఆర్ అందుబాటులో లేకుండా వ్యవహరిస్తున్నారని పొన్నం ఆరోపించారు. ప్రతిపక్ష నేత పాత్రను కూడా నిర్వర్తించడం లేదని విమర్శించారు. ఈ అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకే మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరిస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహా ధర్నా ద్వారా కేసీఆర్ వ్యవహారశైలిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలను వివరించనున్నట్లు చెప్పారు.

22ఏ జాబితా నుంచి ప్రజల ఇళ్లను తొలగించాలి

- సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీపై ఎంపీ రఘునందన్‌రావు ఆగ్రహం
- 1500 ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడంపై ప్రజల ఆవేదన
- ప్రభుత్వ అనుమతులతోనే కాలనీ నిర్మాణం జరిగిందన్న ఎంపీ
- 55 ఎకరాల్లో సింఫనీ హోమ్స్ నిర్మించారని వెల్లడి
- 12 ఏళ్ల క్రితం నిర్మించిన కాలనీని ఎలా చేర్చారన్న ప్రశ్న
- రుణాలు తీసుకుని కట్టుకున్న ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై ఆగ్రహం
- రేవంత్‌రెడ్డి ఇల్లు 22ఏ జాబితా నుంచి ఎలా తొలగించారని నిలదీత
- ప్రజల ఆస్తులనూ అదే తరహాలో తొలగించాలని డిమాండ్
- అధికారుల తప్పులకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్న ఎంపీ
- బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని రఘునందన్‌రావు డిమాండ్

హైదరాబాద్, (డీడీ9 వార్త):

పఠాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ నిషేధిత జాబితా అంశంపై నిర్వహించిన సమావేశంలో *మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రజలకు అండగా పోరాడతామని హామీ ఇచ్చారు.* కాలనీలోని సుమారు 1,500 ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల అనుమతులతో నిర్మించిన ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చడం ఏమిటని ఎంపీ ప్రశ్నించారు.

ప్రభుత్వ అనుమతులతో నిర్మాణం

పఠాన్‌చెరులో 55 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ శాఖల అనుమతులతోనే సింఫనీ హోమ్స్ నిర్మాణం జరిగిందని రఘునందన్‌రావు తెలిపారు. ఇలాంటి కాలనీని నిషేధిత



జాబితాలో చేర్చడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

రుణాలు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్నారు

రూపాయి రూపాయి కూడబెట్టి, రుణాలు తీసుకుని ఇళ్లను నిర్మించుకున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ఇళ్లను రాత్రికి రాత్రే 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం బాధాకరమని ఎంపీ పేర్కొన్నారు.

12 ఏళ్ల క్రితం నిర్మించిన కాలనీ

సుమారు 12 ఏళ్ల క్రితమే నిర్మాణం పూర్తయిన కాలనీని ఇప్పుడు 22ఏ జాబితాలో ఎలా చేర్చారని రఘునందన్‌రావు ప్రశ్నించారు. కాలనీ నిర్మాణ సమయంలో ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు ఉన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

**రేవంత్‌

22ఏ భూములపై 30 శాతం కమీషన్

మొదటిపేజీ తరువాయి

డిమాండ్ చేశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూదొందే నని రామచందర్‌రావు ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబం దోచుకుందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి బ్రదర్స్ దోచుకుంటున్నారని విమర్శించారు. 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని అన్నారు. తెలంగాణలో భవిష్యత్తులో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. మహా ధర్నాలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందుతున్న హోం గార్డులకు ఆత్మీయ వీడ్కోలు.

డిడి9వార్త / రామగుండం సెప్టెంబర్ 6:

ఈ రోజు రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీసు శాఖలో గత 35 సంవత్సరాలుగా హోం గార్డులుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న జె.రామయ్య (హోం గార్డు నంబర్: 256), మంచిర్యాల జిల్లా పరిధిలో,పి. సత్తయ్య (హోం గార్డు నంబర్: 249), గోదావరిఖని, పెద్దపల్లి జిల్లా పరిధిలో సేవలందించిన సందర్భంగా ఇద్దరికీ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వారికి పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్,ఏఆర్ ఏసీపీ ప్రతాప్,హోం గార్డ్స్ ఆర్ఐ పెద్దన్న, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్,ఇన్‌స్పెక్టర్ ఎం.తిరుపతి, ప్రధాన కార్యదర్శి జె. అంజనేయులు, సంయుక్త కార్యదర్శి కె.ఓంకార్, సభ్యులు,హోం గార్డ్స్ ఇన్‌చార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవం

- **సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనది: ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్**

భద్రాచలం, సెప్టెంబర్ 5 (డిడి9 వార్త)

భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య జాన్ మిల్టన్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులను ఎప్పుడూ గౌరవించాలని, వారు చూపిన సన్మార్గంలో పయనించి ఉజ్వల భవిష్యత్తును రూపుదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. రామాయణ, మహాభారత కాలం నాటి శ్రీరాముడు, ఏకలవ్యుడు, కర్ణుడు వంటి పురాణ పురుషుల గురుభక్తిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. గురువు స్థానం ఎన్నటికీ ప్రత్యామ్నాయం లేనిదని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హవిల, పరీక్షల నియంత్రణ అధికారి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కన్వీనర్లు డాక్టర్ కిరణ్, డాక్టర్ సుధాకర్, రాజనీతి శాస్త్ర విభాగ అధ్యాపకులు వీరస్వామి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ కపిల భారతి, అలాగే ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగా కలిసిన ఎక్సైజ్ అధికారులు.

మణుగూరు. సెప్టెంబర్ 5(డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ సిఐ K.నాగేశ్వరరావు మరియు ఎక్సైజ్ ఎస్సై R. విజయ్ భాస్కర్ లు మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును శనివారం నాడు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారి పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.



విద్యార్థులను ఫోన్‌కు దూరంగా ఉంచాలి.. క్రీడలపై ఆసక్తి పెంచాలి

మొదటిపేజీ తరువాయి

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన వారితో మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తులో ఉపాధ్యాయుల పాత్రపై ఆయన మాట్లాడారు.

దైనందిన జీవితంపైనా శ్రద్ధ

విద్యార్థుల చదువు విషయంలో మాత్రమే కాకుండా వారి దైనందిన జీవితంపైనా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని మోదీ సూచించారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్రమంగా తగ్గిపోతున్న నేపథ్యంలో పిల్లలను సరైన మార్గంలో నడిపించడంలో టీచర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. విద్యార్థులు ఎలాంటి అలవాట్లకు లోనవుతున్నారు.. ఏం చేస్తున్నారు అనే విషయాలను నిరంతరం గమనించాలని చెప్పారు.

మాదకద్రవ్యాలపై అప్రమత్తత

మాదకద్రవ్యాల సమస్యను ప్రస్తావించిన ప్రధాని.. పిల్లలు చెడు అలవాట్లకు గురికాకుండా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను గుర్తించి వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని చెప్పారు.

ఫోన్‌కు దూరంగా.. క్రీడలకు దగ్గరగా

విద్యార్థులు స్క్రీన్‌ను చూసే సమయాన్ని తగ్గించడం ప్రస్తుతం ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. క్రీడలు, సృజనాత్మక అవిష్కరణలపై పిల్లల్లో ఆసక్తిని పెంచడం ద్వారా వారిని ఫోన్‌కు దూరంగా ఉంచవచ్చన్నారు. అదే సమయంలో నూతన సాంకేతికతలపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతిభను గుర్తించాలి

బోధన ద్వారా విద్యార్థుల్లో అనేక మార్పులు తీసుకురావచ్చని ప్రధాని అన్నారు. పిల్లలు తమ కలలను సాకారం చేసుకోవడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. ప్రతి చిన్నారిలోనూ ఏదో ఒక ప్రతిభ ఉంటుందని.. దాన్ని టీచర్లు గుర్తించి ప్రోత్సహిస్తే వారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని పేర్కొన్నారు.

తరగతి గదికే పరిమితం చేయొద్దు



విద్యార్థులను కేవలం తరగతి గదికే పరిమితం చేయకూడదని మోదీ సూచించారు. వారిని బయటకు తీసుకువెళ్లి నిజ జీవిత నైపుణ్యాలు, సమాజ పరిస్థితులపై అవగాహన కల్పించాలని చెప్పారు. పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలను కూడా బోధించాలని ఉపాధ్యాయులను కోరారు.

82 మందికి జాతీయ పురస్కారాలు

ఈ ఏడాది 82 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ నుంచి 48 మంది, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్‌ల నుంచి 21 మంది అధ్యాపకులు ఉన్నారు. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత విభాగం నుంచి మరో 13 మంది నైపుణ్య శిక్షకులు పురస్కారాలకు ఎంపికయ్యారు. పురస్కార గ్రహీతలు తమ బోధనా పద్ధతులు, అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు.

ప్రజా పాలన కాదు.. 1000 రోజుల ప్రజా పీడన..

- **కాంగ్రెస్ పాలనలో సింగరేణి విధ్వంసం..**
- **టి బి జి కె యస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ.**

మణుగూరు. సెప్టెంబర్ 5(డి డి 9వార్త)

కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజా పాలన కాదని, 1000 రోజుల ప్రజా పీడన అని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ విమర్శించారు. శనివారం ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్ 2 వద్ద ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని కాపు కృష్ణ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సింగరేణి సంస్థలో పురోగతి కంటే విధ్వంసం, వినాశనమే కనిపిస్తోందని అన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలే ఈ శతాబ్దపు అతిపెద్ద మోసమని ఆయన ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో సింగరేణి సంస్థ ఉత్పత్తి, అమ్మకాలు, లాభాలు, బోనస్‌లు, కార్మిక సంక్షేమం వంటి అనేక రంగాల్లో చరిత్రలోనే అత్యున్నత స్థాయికి చేరిందని ఆయన పేర్కొన్నారు. కార్మికులు సంక్షేమంలో స్వర్ణయుగాన్ని చూశారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. నెలకు మూడు మెడికల్ బోర్డులు నిర్వహించి 100 శాతం ఇన్‌వాలిడేషన్ చేస్తామని, బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, కార్మికులకు సొంతింటి పథకం కింద 250 గజాల స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం అందిస్తామని, ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపు కల్పిస్తామని హామీలు ఇచ్చారని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, కార్మికుల నోట్లో మన్ను కొట్టే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను కార్మికులు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో నల్ల నేలపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని కాపు కృష్ణ అన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి కార్మికుల సమస్యలపై ఆయన పలు డిమాండ్లను ప్రభుత్వ, యాజమాన్యాల ముందుంచారు.

నెలలో మూడు మెడికల్ బోర్డులు నిర్వహించాలి.

100 శాతం ఇన్‌వాలిడేషన్ అమలు చేయాలి.

సింగరేణికి రావాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి.

తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి.



150 మస్టర్ల నిబంధనను ఎత్తివేయాలి.

కార్మికుల డిస్మిస్‌లను నిలిపివేయాలి.

సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలి.

బొగ్గు గనుల ప్రైవేటీకరణను నిలిపివేయాలి.

అలవెన్స్‌లపై విధించే ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించాలి.

మైనింగ్, E&M, EP ఆపరేటర్లకు సర్వేస్‌లో అదే ఉద్యోగాన్ని కల్పించాలి.

మారుపేర్ల సమస్యను పరిష్కరించాలి.

ప్లే డేలో N1, PHDలో 50 శాతం విధానాన్ని ఎత్తివేయాలి.

కొత్త అండర్‌గ్రౌండ్ గనులను ప్రారంభించాలి.

ఖాళీల ఆధారంగా ప్రమోషన్లు కల్పించాలి.

ఇంటర్నల్ క్లరికల్ పరీక్ష నిర్వహించాలి.

కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం, ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో టిబిజికెఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర రావు, సెంట్రల్ బ్రాంచ్ నాయకులు జంగం రాజ్ కుమార్, మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్ కుమార్, మురళీకృష్ణ, బద్దుల ప్రవీణ్, కమటం పరమేశ్, సాంబార్ రాజశేఖర్, పి.కె. నాగరాజు, చిరుత వెంకటేశ్వర్లు, పడ్డం శ్రీనివాస్, గూగులోత్ రమేష్ నాయక్, కోన వెంకటేష్, సర్వే నరేష్, తక్కీ, కటారి ప్రసాద్, బీరయ్య, ఇమ్రాన్, తన్నీరు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అలాగే బీఆర్ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వర రావు, ఎడ్ల శ్రీనివాస్, ఆవుల నర్సయ్య, అక్కి నరసింహారావు, భోశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కార్మికులు గేట్ మీటింగ్‌కు హాజరయ్యారు.

అభివృద్ధి మరియు సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా.

- **అన్ని రంగాల్లో పెద్దపల్లి ముందంజ.**
- **కాంగ్రెస్ సంక్షేమ పథకాలతో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారు.**
- **కేటీఆర్ అసత్య ప్రచారాలు మానుకో.**
- **రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**

డిడి9వార్త / పెద్దపల్లి సెప్టెంబర్ 6:

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్ నుంచి జెండా చౌరస్తా వరకు రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని సంబరాలు జరుపుకున్నారు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. రైతుల నుంచి గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేసిన ఘనత నియోజకవర్గంలో తనదేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1540 కోట్లు సన్న ధాన్యానికి బోనస్ చెల్లిస్తే, పెద్దపల్లి నియోజకవర్గంలో రూ.80.68 కోట్లను రైతులకు బోనస్ చెల్లించామని తెలిపారు. వరంగల్ డిక్లరేషన్ ఇచ్చిన హామీ మేరకు 25లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్లు ఒక్కో రైతుకు రూ. 2లక్షల చొప్పున రుణ మాఫీ చెల్లించి తిరిగి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడైనా ఏ ఒక్క రైతుకైనా లక్ష రూపాయల రుణ మాఫీ ఏక కాలంలో చేశారా అని ప్రశ్నించారు.రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని, రైతులు ఎవరూ అధైర్యపడవద్దని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంపై బీఆర్ఎస్ అక్కసు వెళ్లగక్కుతోందని దుయ్యబట్టారు. రూ. 5లక్షల నుంచి 10లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలకు గుడిసెల రహిత తెలంగాణ లక్ష్యంగా అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటికే మొదటి విడతలో 3వేల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని గుర్తు చేశారు. రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇంటి పథకంతో పేదల సొంతింటి కల నెరవేరిందన్నారు. మరో 10 రోజుల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ. 88కోట్లు విడుదల చేయించామని, పనులు కొనసాగుతున్నాయని, మరో 80 కోట్లు భూ సేకరణ కోసం నిధులు మంజూరు చేయించనున్నట్లు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు విస్తరించి రూ. 53 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు నంబర్ వన్ గా ఉన్నాయని కితాబునిచ్చారు.

స్వయాన కేంద్ర మంత్రి బండి సంజయ్ నియోజకవర్గ కేంద్రంలో ఆర్డీబీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, కానీ పెద్దపల్లిలో మాత్రం ఆర్డీఓబీ పనులు చకచక సాగి పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. రెండు, మూడు నెలల్లో ఆర్డీబీ ప్రజలకు అందుబాటులోకి కూడా తీసుకువస్తామని తెలిపారు. అవినీతి రహిత పాలనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలకు గతంలో 3100 కోట్ల వడ్డీ బకాయి పెట్టిన బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు హయంలో ఆమ్ ఆద్మీ బీమా యోజన పథకాన్ని కొనసాగిస్తున్నామని, విడతల వారీగా మహిళలకు వడ్డీ బకాయిలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న రేవంత్ సర్కారుపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్నటువంటి సంక్షేమ పథకాల పట్ల ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని ప్రతిపక్షాలకు అది మింగుడుపడటం లేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పెద్దపల్లి,సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు,వైస్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



1000 రోజుల విఫల కాంగ్రెస్ పాలనపై మణుగూరులో BRS యూత్ పోరుబాట.

- **భారీ ర్యాలీ తో నిరసన తెలిపిన విద్యార్థులు,నిరుద్యోగులు.**
- **తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత.**

మణుగూరు. సెప్టెంబర్ 5(డి డి 9వార్త)

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని BRS పార్టీ పినపాక నియోజకవర్గం యువజన విభాగం నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వంపై BRS పార్టీ చేపట్టిన పోరుబాటలో భాగంగా మణుగూరులో ప్లకార్డులతో విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై శనివారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మణుగూరులోని BRS పార్టీ కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మణుగూరు తహశీల్దార్ కు నిరుద్యోగుల తరపున డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా BRS యువజన విభాగం నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ సర్కార్ నిరుద్యోగ భృతి కింద ఇవ్వాల్సిన రూ. 8,832 కోట్లు బాకీ పడి, యువతను తీవ్రంగా వంచించిందని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఏటా జాబ్ క్యాలెండర్,నిరుద్యోగులకు నెలకు రూ. 4,000 నిరుద్యోగ భృతి,పెండింగ్ లోఉన్న ఫీజు రియింబర్స్ మెంట్,యువతకు వడ్డీ లేకుండా పది లక్షలు రుణాలు ఇస్తామని, అదేవిధంగా జిల్లాకు ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు, నియోజవర్గంలో క్రీడాకారుల కోసం ప్రత్యేక అకాడమీ ఏర్పాటు,చదువుకునే విద్యార్థులకు ఉచిత స్కూటర్లు ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్,ఇప్పటివరకు ఆ హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగుల పరిస్థితి "ఎక్కడేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇచ్చిన హామీలను నెరవేర్చని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులు, మహిళల తరపున ఎల్లప్పుడూ నిలదీస్తూనే ఉంటామని,వారికి BRS పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలోపినపాక నియోజకవర్గమణుగూరు,అశ్వాపురం,కరకగూడెం,పినపాక మండలాల BRS పార్టీ యువజన విభాగం అధ్యక్షులు భోశెట్టి రవి ప్రసాద్,గుర్రం సృజన్, గద్దల రామకృష్ణ,గుడ్ల రంజిత్ కుమార్,చెన్న కేశవులు,జిల్లా యువజన నాయకులు పద్దం శ్రీనివాస్,ఆవుల శ్రీను,జక్కం రంజిత్,సూర్యం, నజీర్ సోను,చల్లా రాజేష్,పవన్,డేగల సంపత్,బాజీ, బోశెట్టి దీపక్, సతీష్,సాధనపల్లి లక్ష్మీనారాయణ మొదలగు యువజన నాయకులు,విద్యార్థులు,నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి మార్గదర్శకం

- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**
- **ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే పాయం.**

మణుగూరు. సెప్టెంబర్ 5(డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని జడ్పీహెచ్ఎస్ కో ఎడ్యుకేషన్ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయుల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, మంచి నడవడి, సామాజిక బాధ్యత వంటి ఉన్నతమైన లక్షణాలను పెంపొందిస్తున్నారని పేర్కొన్నారు.

భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థులను తీర్చిదిద్దే గురువుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, సృజనాత్మకత, సామాజిక స్పృహ, మానవతా విలువలను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పినపాక నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాల కల్పనకు తన వంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.



ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల తమ గౌరవాన్ని చాటుతూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించి, ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

వినాయక చవితి వేడుకల్లో విద్యుత్ భద్రతే అత్యంత ప్రాధాన్యత: ఎస్ఈ బి .బిక్షపతి స్పష్టం

ములుగు, డీ డీ 9 వార్త :

గణేష్ మండపాలు, నిమజ్జన మార్గాల్లో ప్రత్యేక తనిఖీలు, విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.బిక్షపతి స్పష్టం చేశారు.

ఈ నెల 14న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్ అలంకరణలు, విగ్రహాల తరలింపు, నిమజ్జనం సమయంలో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రజలు, భక్తులు, మండప నిర్వాహకులు, విద్యుత్ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

“పండుగ వేడుకల్లో ఆనందం ఎంత ముఖ్యమో, ప్రతి ఒక్కరి ప్రాణ భద్రత అంతకంటే ముఖ్యం. ఒక చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉన్నందున విద్యుత్ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలి” అని ఎస్ఈ స్పష్టం చేశారు.

నిమజ్జన మార్గాల్లో విద్యుత్ సిబ్బందికి ప్రత్యేక సూచనలు

విగ్రహాల ఎత్తు, ట్రక్కులు, క్రేన్ల ఎత్తును దృష్టిలో ఉంచుకుని నిమజ్జన మార్గాలను విద్యుత్ సిబ్బంది ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు.

* మార్గంలోని విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాలను తనిఖీ చేయాలి.
* ప్రమాదకరంగా లేదా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించి అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టాలి.
* నిమజ్జన మార్గాల్లో మార్గాల పరిశీలన పూర్తి చేసి, సంబంధిత అధికారుల ద్వారా ముందస్తుగా ధృవీకరించాలి.
* క్రేన్లు, భారీ వాహనాలు, ఎత్తైన విగ్రహాలు విద్యుత్ లైన్లకు తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రజలకు, మండపం నిర్వహులకు పలు సూచనలు.

విద్యుత్ లైన్లకు దగ్గరగా గణేష్ విగ్రహాలు, క్రేన్లు, మెటల్ ఫ్రేములు లేదా ఇతర అలంకరణ సామగ్రిని తీసుకెళ్లడం ప్రమాదకరమని, జాగ్రత్తగా, దూరంగా తీసుకువెళ్లాలని కోరుతున్నారు.

విద్యుత్ తీగను నేరుగా తాకకపోయినా దగ్గరగా వెళ్లడం వల్ల విద్యుత్ ప్రసరణ/ఇండక్షన్ కారణంగా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. కాబట్టి విద్యుత్ లైన్లకు సురక్షిత దూరం పాటించడం తప్పనిసరి. మండపాలు, నిమజ్జన మార్గాలు, ప్రధాన రహదారుల్లో ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో ఎక్కడైనా తెగిపోయిన విద్యుత్ తీగలు , లూజ్ లైన్లు,విద్యుత్ స్తంభాలు,ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే ప్రజలు వాటిని తాకకూడదు.

రెటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరుతున్నారు.

గణేష్ మండపాల నిర్వాహకులు విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేసేటప్పుడు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని చెప్పారు.

* విద్యుత్ కనెక్షన్‌ను అధికారిక విద్యుత్ సిబ్బంది ద్వారానే పొందాలి.
* నాణ్యమైన, ISI మార్క్ కలిగిన వైర్లు, పరికరాలను మాత్రమే ఉపయోగించాలి.
* సరైన సామర్థ్యం కలిగిన MCB/రక్షణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి.
* జాయింట్లు, దెబ్బతిన్న వైర్లు, టేప్‌తో తాత్కాలికంగా చేసిన కనెక్షన్లను ఉపయోగించరాదు.
* విద్యుత్ వైరింగ్‌ను నీరు, తేమకు దూరంగా ఉంచాలి.
* వర్షం పడినప్పుడు తడిసిన వైర్లు, స్విచ్‌లు, విద్యుత్ పరికరాలను తాకరాదు.
* పిల్లలను విద్యుత్ స్తంభాలు, వైర్లు, విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలి.
* మండపాల వద్ద మెటల్ నిర్మాణాలు విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కేబుల్ వైర్లపై ప్రత్యేక దృష్టి

టీవీ, ఇంటర్నెట్ తదితర కేబుల్ వైర్లు విద్యుత్ స్తంభాలపై చిందరవందరగా లేదా తక్కువ ఎత్తులో వేలాడుతూ ఉండకుండా సంబంధిత కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

పండుగ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇలాంటి వైర్లను ప్రత్యేకంగా తనిఖీ చేసి ప్రమాదకర పరిస్థితులను తొలగించాలని సూచించారు.

విద్యుత్ భద్రత , ప్రతి ఒక్కరి బాధ్యత

విద్యుత్ భద్రతా నియమాలు పాటిస్తూ, టీజీఎన్పీడీసీఎల్ కు సహకరించి వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా, ముఖ్యంగా ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు లేకుండా సురక్షితంగా నిర్వహించుకోవాలని ప్రజలకు ఎస్ఈ విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ విజయోత్సవాల్లో కడకంచి బాలమణి

- **SIR–ఫేజ్ 2 BLA శిక్షణలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్**

జనగామ సెప్టెంబర్ 5(డిడి 9వార్త)బ్యూరో

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జనగామలో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ పాల్గొన్నారు. బస్టాండ్ చౌరస్తా నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించారు. కార్యక్రమంలో భాగంగా SIR-ఫేజ్ 2 BLA శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.





జనగామను వీడే ప్రసక్తే లేదు

- **ఇక్కడే ఇల్లు కట్టుకుంటున్నా.. జీవితాంతం ప్రజల కోసం పోరాడుతా: పల్లా**

జనగామ సెప్టెంబర్ 5(డిడి 9 వార్త)బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. హామీల అమలుకు డిమాండ్ చేస్తూ శనివారం జనగామలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మహాధర్నా నిర్వహించారు. రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో మహిళలు, విద్యార్థులు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ..మహిళల ఖాతాల్లో నెలకు రూ.2,500, పింఛన్ రూ.4 వేలు, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, రెండు లక్షల ఉద్యోగాలు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం వంటి హామీలను ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు నీరు, విద్యుత్తు, యూరియా సక్రమంగా అందడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన 24 గంటల విద్యుత్తును అందించాలని కోరారు. బాణాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో పేదలకు న్యాయం చేయాలని, అవసరమైతే కలెక్టరేట్ ముట్టడికి సిద్ధమని హెచ్చరించారు.

‘నా జన్మభూమి స్టేషన్‌ఘన్‌పూర్.. నా కర్మభూమి జనగామ. రాజకీయాల్లో ఉన్నంతకాలం జనగామలోనే ఉంటా. ఇక్కడే ఇల్లు కట్టుకుంటున్నా. జనగామను వీడే ప్రసక్తేలేదు’ అని పల్లా స్పష్టం చేశారు.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జనగామ జిల్లాగా ఏర్పాటు, మెడికల్ కళాశాల, పెద్దాసుపత్రి, దేవాదుల నీరు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.





గురువులకు విద్యార్థుల నీరాజనం!

- **కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు**

పెద్దపల్లి బ్యూరో, (డీడీ9 వార్త):











గురువే విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేస్తాడని, ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణంలో చిరస్మరణీయమని కళాశాల చైర్మన్ డాక్టర్ రవికుమార్ నాగండ్ల అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మార్కండేయ కాలనీలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కళాశాల చైర్మన్ డాక్టర్ రవికుమార్ నాగండ్ల ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదన్నారు. విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను జీవితాంతం గౌరవించాలని, వారు చూపిన సన్మార్గంలో నడుస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

కళాశాల డైరెక్టర్ జమున రవికుమార్ మాట్లాడుతూ.. లెక్చరర్లు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథాన్ని పెంపొందిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు కీలకమన్నారు.

ప్రిన్సిపల్ ఎం. వెంకన్న మాట్లాడుతూ.. భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థులను తీర్చిదిద్దుతున్న గురువుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, సృజనాత్మకత, సామాజిక స్పృహ, మానవతా విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గురువులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. టీచర్స్ డే సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ రవికుమార్ నాగండ్ల, డైరెక్టర్ జమున రవికుమార్, ప్రిన్సిపల్ ఎం. వెంకన్నతో పాటు లెక్చరర్లను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించి టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆర్. నర్సింగ రావు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

షైన్ హైస్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- **ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలు...**
- **డైరెక్టర్ లాల్ మహమ్మద్**
- **ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన విద్యార్థులు**

బోనకల్,సెప్టెంబర్ 05, (డీడీ9 వార్త):

స్థానిక షైన్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం చాలా ఘనంగా నిర్వహించారు,ఈ వేడుకల్లో విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.విద్యార్థులు ఉపాధ్యాయులకు సన్మానం చేశారు.ఉపాధ్యాయుల గురించి పాటలు పాడారు.పాఠశాల వాతావరణం అంతా పండగ వాతావరణంలా మారి పోయింది.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అనేది చాలా గొప్పది అని,ఉపాధ్యాయులందరికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్ లాల్ మహమ్మద్ మాట్లాడుతూ సమాజంసక్రమ మార్గం లో నడవాలంటే ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉన్నదని అన్నారు.

పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేత మాట్లాడుతూ ఏ రంగంలోనైనా మేధావులను తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్,ప్రిన్సిపాల్ శ్వేత,అడ్మినిస్ట్రేటర్ వేలాద్రి,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



నందిని–సైదేశ్వరరావుల వివాహ వేడుకకు ప్రముఖుల హాజరు

చింతకాని,సెప్టెంబర్ 05, (డీడీ9 వార్త):

నాగులవంచ గ్రామానికి చెందిన బైరు వెంకటేశ్వర్లు-నాగమణి దంపతుల కుమార్తె నందిని, సైదేశ్వరరావుల వివాహ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు పలువురు రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీ గజగిరి లక్ష్మీనరసింహస్వామి, శ్రీ కోదండ రామస్వామి దేవాలయ మాజీ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు, దేవాలయ చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్ కాసాని బాలకుమార్, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య-పద్మ దంపతులు,దేవాలయ కమిటీ సభ్యులు వెచ్చ మంగపతిరావు తదితరులు వివాహ వేడుకకు హాజరయ్యారు.అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల వెంకన్న, బైరు వెంకటేశ్వర్లు, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు ఏటుకూరి రవికుమార్, మంద స్వామి తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.గ్రామ పెద్దలు శిలివేరు సైదులు, మంద నాగేశ్వరరావు, తన్నీరు ప్రసాద్, నాగేశ్వరరావు, అనగాని వీరయ్య తదితరులు వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.





భద్రాచలంలో ఘనంగా గురుపూజోత్సవం

- **12 మంది ఉపాధ్యాయులకు సన్మానం**
- **సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం-- రోటరీ అధ్యక్షులు షేక్ అజీమ్**

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 5 (డిడి9 వార్త)

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, గురువులను గౌరవించుకోవడం మనకు మనమే గౌరవం ఇచ్చుకోవడంతో సమానమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ అజీమ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భద్రాచలం ప్రాంతానికి చెందిన ఏడుగురు, ఏటపాక మండలానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పాపినేని రాజేష్, కోశాధికారి కొత్త రామకృష్ణ, ప్రెసిడెంట్ ఎలెక్ట్ పలివెల రవికుమార్, పాస్ట్ ప్రెసిడెంట్లు యశోద రాంబాబు, ప్రభాకర్, గుప్తా, మోతుకూర వీరయ్య, రఫీ, నాగేశ్వరరావు, బాలాజీ, చైతన్య, సాని కొమ్ము శంకర్‌రెడ్డి, శేషు, సీతారామరెడ్డి, వాసిరెడ్డి సాంబశివరావు, వీరభద్రం కుమార్, చలపతి, సందీప్, వందవాసు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- **గ్రామ సర్పంచ్ ముడుతన పెళ్లి మోహన్**
- **హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సామల శ్రీనివాస్**

డి డి 9 వార్త, ములుగు :

జడ్.పి.హెచ్.ఎస్ జంగాలపల్లి పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సామల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ మోహన్ మాట్లాడుతూ.., సర్వేపల్లి రాధాకృష్ణను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని వారు అన్నారు. ఒక ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆయన భారతదేశానికి రెండుసార్లు ఉపరాష్ట్రపతిగా, ఒకసారి రాష్ట్రపతిగా పనిచేయడం ఎంతో గర్వకారణం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మర్తనపల్లి మోహన్ సార్ గారు ఉప సర్పంచ్ చింతల మానస గారు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పానుగంటి సరిత గారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామల శ్రీనివాస్ సార్ గారు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



మండలగూడెంలో కొనసాగుతున్న SIR సర్వే

జనగామ సెప్టెంబర్ 5 (డిడి9 వార్త)బ్యూరో

మండలగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ల Special Intensive Revision (SIR) సర్వే కొనసాగుతోంది. తహసీల్దార్ రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వే సిబ్బంది ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారు. సర్వేకు నోటీసులు అందుకున్న ఓటర్లు, కుటుంబ సభ్యులు తమ ఓటరు గుర్తింపు కార్డు (EPIC), అవసరమైన గుర్తింపు పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయానికి హాజరై సర్వే సిబ్బందికి వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలగూడెం గ్రామ సర్పంచ్ డ్యాగల రాజశేఖర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేడు భద్రాచలంలో విద్యుత్ అంతరాయం

భద్రాచలం టౌన్, (డిడీ 9 వార్త) సెప్టెంబరు 5

ఐటీడీఏ పరిధిలో కొత్త సబ్ స్టేషన్ కు కొత్త టవర్ లైన్ ఏర్పాటు పనులు చేపడుతున్న నేపథ్యంలో రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయం కారణంగా లంబాడి కాలనీ, కస్తూరిబా స్కూల్ అండ్ హాస్టల్, వైటీసీ ట్రైనింగ్ సెంటర్, నర్సింగ్ హాస్టల్, ఆదర్శనగర్ కాలనీ, సుందరయ్యనగర్ కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీ తదితర ప్రాంతాలపై ప్రభావం ఉండనుంది. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు. టవర్ లైన్ ఏర్పాటు పనులకు ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ ఎస్ సమరశంఖం

- **భద్రాచలంలో బీఆర్ ఎస్ వీ ఆధ్వర్యంలో నిరసన**

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 5 (డిడీ9 వార్త)

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బీఆర్ ఎస్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా భద్రాచలంలో శనివారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో బీఆర్ ఎస్ విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు, యువజన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ వీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని విమర్శించారు. విద్యార్థుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే జీవో నంబర్ 97ను వెంటనే బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు సమగ్ర జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడితే చూస్తూ ఊరుకునేది లేదని బీఆర్ ఎస్ వీ నాయకులు హెచ్చరించారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు, బీఆర్ ఎస్ వీ కార్యకర్తలు, విద్యార్థులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శాంతి నిలయంలో ఘనంగా మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండా జన్మదిన వేడుకలు

- **మానవత్వమే కొండా సేవా మార్గమని కొనియాడిన నేతలు**

బోనకల్,సెప్టెంబర్ 5, (డిడీ9 వార్త):

మాజీ జెడ్పీటీసీ, ప్రజా సేవకులు బానోత్ కొండా జన్మదిన వేడుకలను బోనకల్ మండల కేంద్రంలోని శాంతి నిలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కొండాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాంతి నిలయంలోని చిన్నారులకు బిస్కెట్లు, పండ్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు మాట్లాడుతూ.. బానోత్ కొండా రాజకీయ పదవులను ప్రజా సేవకు ఒక వేదికగా మాత్రమే భావిస్తూ, తనకు సాధ్యమైనంత మేరకు పేదలు,నిరుపేదలు, పిల్లలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. జన్మదిన వేడుకలను కూడా ఆర్భాటాలకు దూరంగా ఉన్న కొండ శ్రేయోభిలాషులు మానవత్వాన్ని చాటేలా చిన్నారులతో కలిసి జరుపుకోవడం అభినందనీయమన్నారు,

ప్రజల కష్టాల్లో భాగస్వామిగా నిలిచి, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న కొండాకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.


"పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనే తపన, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే మానవత్వం బానోత్ కొండా ప్రత్యేకత" అని సుధాకర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గుగులోతు రమేష్, గుగులోతు నాగేశ్వరరావు, తెల్లూరి రమేష్, చిట్టూరి ప్రసాద్, షేక్ మీరా సాహెబ్, మరిధు శేషు, జరుపుల శివకృష్ణ, షేక్ బాజీ, టైగర్ మల్లెల వేలాద్రి, గంగుల పుల్లయ్య, సాయి ఆదిత్య, సిద్ధు, భూక్యా శీను, రాజగోపాల శ్రీను తదితరులు పాల్గొని బానోత్ కొండాకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

భద్రాచలం (డిడీ9 వార్త), సెప్టెంబరు 5

సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మావతి హాస్పిటల్స్ లో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి సత్కరించడంతో పాటు సర్టిఫికేట్ ఆఫ్ రికగ్నిషన్ లను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డా. శ్రావణి కొమ్మూరు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించకుండా, జీవితంలో సరైన మార్గాన్ని చూపించే మార్గదర్శకులుగా నిలుస్తున్నారని అన్నారు. మంచి ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. పద్మావతి తల్లి పిల్లల హాస్పిటల్స్, పద్మావతి డయాగ్నస్టిక్ సెంటర్ సీఈఓ డా. మల్లంపాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి విజయానికి వెనుక ఉపాధ్యాయుడి ప్రోత్సాహం, మార్గదర్శనం ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ భద్రాచలం మాజీ అధ్యక్షులు డా. రమేష్ మాట్లాడుతూ సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని, వారి సేవలను గుర్తించి సన్మానించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో రొటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.







కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ పేరుతో యువతకు పంగనామాలు ..

- **హామీలన్నీ గాలికి... మెచ్చ. నాగేశ్వరరావు..!****
- **అశ్వారావుపేట:సెప్టెంబర్ 05(డిడి 9వార్త)**
- **మేము భర్తీ చేసిన ఉద్యోగాలకు.. నియామక పత్రాలిచ్చి గొప్పలు చెప్పుకుంటారా?**
- **ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలన్నారు.. 2 ఏళ్లలో ఇచ్చింది కేవలం 13 వేలు**
- **కాంగ్రెస్ 20 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆ హామీలు నెరవేర్చలేరు.... ఉప్పల వెంటక రమణ**
- **గురుకులాలు, మెడికల్ కళాశాలలతో విద్యారంగాన్ని అభివృద్ధి చేసింది కేసీఆరే: మాజీ ఎమ్మెల్యే మెచ్చా**
- **అశ్వారావుపేటలో ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ కోసం విద్యార్థులు, యువతతో బీఆర్ఎస్ భారీ ర్యాలీ**

కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా ఐదో రోజు శనివారం అశ్వారావుపేటలో గులాబీ శ్రేణులు, యువత కదం తొక్కారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారు పర్మింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ అమలు కోరుతూ అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో విద్యార్థులు, నిరుద్యోగ యువకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ MLA, BRS పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు మరియు బీఆర్ఎస్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇంచార్జ్ ఉప్పల వెంకటరమణ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తీవ్ర స్థాయిలో ఎండగట్టారు.

విద్యార్థులు, యువతను నిలువునా మోసం చేశారు: మెచ్చా నాగేశ్వరరావు

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గురుకులాలను అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించామని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గుర్తుచేశారు. జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసి వైద్య విద్యను సామాన్యులకు చేరువ చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు 'హైదరాబాద్ యూత్ డిక్లరేషన్' పేరుతో యువతను, విద్యార్థులను నమ్మించి, తీరా అధికారంలోకి వచ్చాక వారిని నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు.

నియామక పత్రాలు ఇస్తే కాంగ్రెస్ ఉద్యోగాలు ఇచ్చినట్టేనా?: ఉప్పల వెంకటరమణ

కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడతామని, ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మాయమాటలు చెప్పి నిరుద్యోగులను దారుణంగా వంచించిందని ఉప్పల వెంకటరమణ విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా ఇప్పటివరకు ఇచ్చింది కేవలం 13 వేల ఉద్యోగాలు మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాసెస్ పూర్తి చేసి భర్తీ చేసిన ఉద్యోగాలకు.. ఇప్పుడు కేవలం నియామక పత్రాలు చేతికి ఇచ్చి తామే ఉద్యోగాలు ఇచ్చామని కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నియామక పత్రాలు ఇస్తే కాంగ్రెస్ ఉద్యోగాలు ఇచ్చినట్టేనా? ఏడాదిలోపు ఇస్తామన్న ఉద్యోగాలు.. వీళ్లు 20 ఏళ్లు అధికారంలో ఉన్నా పూర్తి చేయలేరని ఆయన దుయ్యబట్టారు.

ఇచ్చిన హామీలన్నింటినీ గాలికి వదిలేసి యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు,భారీ సంఖ్యలో విద్యార్థులు, నిరుద్యోగ యువకులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి ఉపాధ్యాయుడు

- **భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్**

భద్రాచలం టౌన్ (డిడీ9 వార్త), సెప్టెంబరు 5

విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దే విజయ శిఖరాలకు నడిపించేది ఉపాధ్యాయుడేనని ఐటీడీఏ పీవో బి. రాహుల్ అన్నారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గిరిజన భవన్ లో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీవో రాల్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో సవాళ్లను ఎదుర్కొంటూ ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఒక విద్యార్థిని తీర్చిదిద్దితే ఒక కుటుంబం, వందమందిని తీర్చిదిద్దితే ఒక సమాజం, వేల మందిని తీర్చిదిద్దితే దేశ భవిష్యత్తు మారుతుందని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం మాత్రమే కాదని, అది బాధ్యత, సేవ, పవిత్ర యజ్ఞమని పేర్కొన్నారు. గిరిజన విద్య బలోపేతానికి ఉద్దీపకం కార్యక్రమాల ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక విద్యకు బలమైన పునాది వేస్తేనే ఉన్నత విద్యలో విద్యార్థులు రాణిస్తారని అన్నారు. ఉద్దీపకం3, వారధి పుస్తకాన్ని ప్రవేశపెట్టి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. వారానికి మూడు రోజులు ఇంగ్లీష్, గణితంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే అంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రశంసించారు. విద్యార్థుల్లో కుల, మత, ఆర్థిక భేదాలు లేకుండా సమానంగా విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి ఆత్మవిశ్వాసం పెంపొందించాలని అన్నారు. విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, మానవత్వం, దేశభక్తి వంటి లక్షణాలను పెంపొందించాలని సూచించారు. 100 శాతం పదో తరగతి ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయడంతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పీఈటీలు, పీడీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో డేవిడ్ రాజ్, డీడీ చందన, ఆర్ సీవో అరుణకుమారి, ఏసీఎంవోలు, ఏటీడీవోలు పాల్గొన్నారు.





ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.


- **పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమన్న పాయం.**

మణుగూరు. సెప్టెంబర్ 5 (డి డి 9వార్త)





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం, శివలింగాపురం గ్రామానికి చెందిన కోతపల్లి ఉపేంద్ర నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని, లబ్ధిదారుల కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.
ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇల్లు పూర్తి చేసుకుని గృహప్రవేశం చేసుకున్న ఉపేంద్ర కుటుంబానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



రామాలయంలో ఉత్సాహంగా ఉట్ల ఉత్సవం

- **పాల్గొన్న దేవస్థానం ఈవో, భక్తులు**

భద్రాచలం టౌన్ (డీడీ9 వార్త), సెప్టెంబరు 5

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో ఉట్ల ఉత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. శ్రీ సీతారామచంద్రస్వామివారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఉట్ల ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసి నాయకుడు పాయం దుర్గారావు గారి అకాల మరణం ఆదివాసీ సమాజానికి తీరని లోటు

అశ్వరావుపేట:సెప్టెంబర్ 05 (డిడి 9వార్త)





అశ్వరావుపేట మండలానికి చెందిన ప్రముఖ ఆదివాసీ నాయకుడు పాయం దుర్గారావు వినాయకపురం నుండి పనులు ముగించుకొని నారాయణపురం రోడ్డులో మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. సమాచారం అందుకున్న గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారు దుర్గారావు గారి పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి శవ పంచనామా పనులు దగ్గరుండి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... పాయం దుర్గారావు గారి మరణం ఆదివాసీ సమాజానికి తీరని లోటు అని, ఆయన ప్రజల కోసం చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మరియు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యాన్ని చెప్పారు...
పాయం దుర్గారావు నివాసంలో పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జిల్లా ఆదివాసి నాయకుడు సోయం వీరభద్రం మాట్లాడుతూ... అశ్వరావుపేట మండలం నారాయణపురం పంచాయతీ నెమిలి పేట గ్రామంలో అశ్వరావుపేట జేఏసీ ఆదివాసి నాయకులు పాయం దుర్గారావు గారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి స్వగృహంలో జిల్లా ప్రముఖ ఆదివాసి నాయకులతో కలిసి పార్థివ దేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యం నింపిన జిల్లా ఆదివాసి నాయకులు. పాయం దుర్గారావు లాంటి నాయకులు ఆదివాసి కుటుంబంలో అరుదుగా ఉండే గొప్ప నాయకత్వ లక్షణాలతో అందర్నీ కలుపుకొని గల మనిషి పాయం దుర్గారావు ఇటువంటి మనిషి మధ్యన లేకపోవడం మన దురదృష్టకరం ఇటువంటి ఆదివాసి నాయకుడిని కోల్పోయిన అశ్వరావుపేట దమ్మపేట మండలాల ఆదివాసులకు తీరని లోటు ఆయన చేసిన సేవలు ఆయనతో పనిచేసిన నాయకులకు ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలని వీరభద్రం పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు అశ్వరావుపేట టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కట్టం. స్వామి దొర ,భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ, పూనం వీరభద్రం, పాయం రవి వర్మ, దార బోయిన రమేష్, బండారు సూర్యనారాయణ, తెల్లం రామారావు, నారాయణపురం సర్పంచ్ కుమారి ఆంధ్రయ, పద్దం విజయలక్ష్మి, దారా ప్రసాద్, బోడి కి మంగరాజు, పాయం బుచ్చిరాజు, కంగాల పరమేశు, తోడం నాగేశ్వరరావు, మడకం మంగరాజు, తదితర ముఖ్య నాయకులు జిల్లా ముఖ్య నాయకులు ఆదివాసి కుల నాయకులు వివిధ శాఖల నాయకులు పాల్గొన్నారు

ఎంత ఎదిగినా గురువును మరువని శిష్యుడు...

- **గురు పూజోత్సవం నాడు చిన్ననాటి గురువుకు పాదాభివందనం చేసిన..**
- **పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

మణుగూరు. సెప్టెంబర్ 5(డి డి 9వార్త)

రాజకీయాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పటికీ, తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మరువకుండా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తన వినమ్రతను చాటుకున్నారు. గురుపూజోత్సవం (సెప్టెంబర్ 5) సందర్భంగా శనివారం ఆయన పినపాక మండల కేంద్రంలో నివాసం ఉంటున్న తన చిన్ననాటి గురువు, హైస్కూల్ తెలుగు మాస్టారు శ్రీ ఎల్లాప్రగడ రామ్మూర్తి గారిని స్వయంగా వారి ఇంటికి వెళ్లి మరీ ఆత్మీయంగా కలుసుకున్నారు.ఎలాంటి ఆర్భాటం లేకుండా నేరుగా గురువుగారి ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, రామ్మూర్తి గారిని చూడగానే ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఆయనకు పూలబొకే అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం గురువుగారి పాదాలకు నమస్కరించి, నిండు మనసుతో వారి ఆశీస్సులు తీసుకున్నారు.
ఒక సాధారణ విద్యార్థి స్థాయి నుంచి నేడు పినపాక ఎమ్మెల్యేగా ప్రజాసేవలో ఉన్న తన శిష్యుడు, తనను గుర్తుపెట్టుకుని స్వయంగా ఇంటికి వచ్చి సత్కరించడం పట్ల తెలుగు మాస్టారు ఎల్లాప్రగడ రామ్మూర్తి గారు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.
ఉన్నత స్థానంలో ఉన్న ఒక ప్రజాప్రతినిధి తన చిన్ననాటి గురువును ఇంతటి గౌరవంతో సత్కరించడం నేటి తరానికి, విద్యార్థులకు ఆదర్శనీయమని పలువురు విద్యాభిమానులు, స్థానికులు ప్రశంసిస్తున్నారు. గురుశిష్యుల బంధానికి ఈ కలయిక అద్దం పడుతోందని కొనియాడారు.



విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తులో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

- **డాక్టర్ తలారి.వెంకటేశ్వర్లు,**
- **సమాజ నిర్మాణంలో గురువుల సేవలు అమూల్యం**
- **ట్రస్ట్ చైర్మెన్ కొప్పుల మురళి**

భద్రాచలం, సెప్టెంబరు 5 (డిడి9 వార్త)

విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ మరియు మదర్ థెరిస్సా బీఈడీ కళాశాల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.డిగ్రీ, బి ఈ డి కళాశాల ప్రిన్సిపాల్ లకు , పాఠశాల ప్రధానోపాధ్యాయులకు , ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి, షీల్డ్ లను అందజేశారు
ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి, బీఈడీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ తలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించడంతోపాటు వారి భవిష్యత్తుకు సరైన మార్గనిర్దేశం చేయడంలో ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో గురువుల పాత్ర ప్రత్యేకమైనదని, ప్రతి విద్యార్థి విజయం వెనుక ఉపాధ్యాయుల అంకితభావం ఉంటుందని తెలిపారు. అనంతరం పలువురు అధ్యాపకులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పేరాల నాగేంద్ర, హరికృష్ణ, చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు, కోమటిరెడ్డి చైతన్య తదితరులు పాల్గొన్నారు.





ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో కాంగ్రెస్ మహా ధర్నా!


- **మహా ధర్నా విజయవంతానికి కాంగ్రెస్ శ్రేణుల సన్నాహాలు**
- **మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం**
- **సమావేశంలో పాల్గొన్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్**


హైదరాబాద్.సెప్టెంబర్ 5,(డిడి9 వార్త):

ఆదివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సన్నాహాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో మహా ధర్నా ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో మహా ధర్నాకు సంబంధించిన ఏర్పాట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయం, పెద్ద సంఖ్యలో ప్రజలు మరియు కాంగ్రెస్ శ్రేణులను తరలించే అంశాలపై ముఖ్య నాయకులు చర్చించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ సమావేశంలో పాల్గొని మహా ధర్నా ఏర్పాట్లపై చర్చించారు. నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో మహా ధర్నాలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.
కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ మహా ధర్నాకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా ఇప్పటికే స్థానిక స్థాయిలో సమన్వయం చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. పార్టీ నాయకత్వం ఇచ్చిన పిలుపును విజయవంతం చేసేందుకు ప్రతి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో మంత్రి అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు మధుయాష్కి గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

భారీగా తరలిరానున్న కాంగ్రెస్ శ్రేణులు

ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వేదికగా నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులను సమీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. మహా ధర్నా నేపథ్యంలో నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.






వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

- **చికిత్స కోసం భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలింపు**
- **పట్టణంలో పెరుగుతున్న కుక్కల బెడదపై ప్రజల ఆందోళన**
- **వీధి కుక్కల నివారణకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి..**

భద్రాచలం, సెప్టెంబరు 5 (డిడి9 వార్త)




భద్రాచలం పట్టణంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. శనివారం సాయంత్రం చర్ల రోడ్డు నుంచి ఏఎస్ఆర్ కాలనీకి వెళ్లే మార్గంలో సుమారు పది వీధి కుక్కలు ఓ చిన్నారిపై గుంపుగా దాడి చేశాయి. ఈ ఘటనలో చిన్నారి ముక్కు, కుడి బుగ్గపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.
పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. గతంలోనూ కుక్కల దాడులు చోటుచేసుకున్నప్పటికీ.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
వీధి కుక్కల నియంత్రణకు సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులపై దాడులు పునరావృతం కాకుండా పట్టణంలోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను నియంత్రించాలని.. లేకుంటే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యంతో ఉన్న మహిళలకు పద్మశాలి సంఘం చేయూత..

చర్ల, సెప్టెంబర్ 5 (డిడి 9 వార్త)

చర్ల మండల కేంద్రంలోని గణేశ్ నగర్ కు చెందిన బొల్లె సందీప్ భార్య బొల్లె దీపిక (23) కు బ్లడ్ ఇన్ఫెక్షన్ మూలంగా తలెత్తే ఆరోగ్య సమస్యలు రావడంతో భద్రాచలం లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఇప్పటి వరకు తన స్థోమతకు మించి ఖర్చు కావడంతో ఆర్థిక సహాయం కోసం పద్మశాలి సంఘాన్ని ఆశ్రయించారు. ఈ సంధర్భంగా ఫండ్ రైజింగ్ పోస్టు పెట్టి తద్వారా సేకరించిన రూ. 41 వేల నుశనివారం శేశెట్టి సాంబశివరావు చేతుల మీదుగా బొల్లి సందీప్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘ కార్యవర్గ సభ్యులు నీలి ప్రకాష్ మాట్లాడుతూ ఎవరు ఎక్కడ ఏ కష్టాల్లో ఉన్నా ఆ విషయాన్ని సంఘ పెద్దలకు తెలియజేసిన ఎడల ఆదుకోవడానికి సభ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని, ఇదే స్ఫూర్తితో సహాయం తీసుకున్న ప్రతీ ఒక్కరూ కూడా ముందుకొచ్చి కష్టాల్లో ఉన్న ఇతరులకు సహాయం చేస్తే ఇకముందు ఎవరూ కూడా బాధల్లో ఉండరనన్నారు. ఈ కార్యక్రమంలో ఈర్ని కృష్ణ మోహన్, చింతా నాగుబాబు, దొడ్డి తాతారావు, బండారు భరణి, దొడ్డి సూరిబాబు, వలస లింగమూర్తి, ఇర్సవడ్ల రాము తదితరులు పాల్గొన్నారు.




భద్రాద్రిలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

- **అంకితభావంతో సేవలందించిన ఎనిమిది మందికి మండల స్థాయి పురస్కారాలు**
- **విద్యార్థుల భవిష్యత్తుకు మరింత కృషి చేయాలి: ఎంఈఓ శ్రీనివాసరావు**

భద్రాచలం, సెప్టెంబరు 5. (డిడి9 వార్త)

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాచలం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎనిమిది మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. శనివారం సాయంత్రం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వృత్తిపరంగా, ప్రవృత్తిపరంగా అంకితభావంతో పనిచేస్తూ బలహీన, బడుగు వర్గాల విద్యార్థులకు ఆశాజ్యోతులుగా నిలిచిన ఉపాధ్యాయులను మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి పురస్కారాలు అందజేశారు.
అన్ని ఉపాధ్యాయ సంఘాల సమన్వయంతో ఎంపికైన అవార్డు గ్రహీతలకు శాలువాలు కప్పి, పూలగుచ్ఛాలు అందించి, మెమెంటోలు, మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలని కోరారు.
అవార్డు గ్రహీతలు వీరే..
జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భద్రాచలానికి చెందిన బీవీ రత్నకుమారి (ఎస్ఏ-బయలాజికల్ సైన్స్), కే. పుష్ప (ఎస్ఏ-ఫిజికల్ సైన్స్), ప్రభుత్వ ఉన్నత పాఠశాల భద్రాచలానికి చెందిన పి. నాగమణి (ఎస్ఏ-సోషల్ స్టడీస్), బి. జయబాబు (ఎస్ఏ-బయలాజికల్ సైన్స్), ఎంపీపీఎస్ లంబాడి కాలనీకి చెందిన ఎస్ఎస్వీ అరుణకుమారి (ఎస్జీటీ), ఎంపీపీఎస్ రెవెన్యూ కాలనీకి చెందిన ఎస్. శ్రీదేవి (ఎస్జీటీ), ఎంపీపీఎస్ తాతగుడి సెంటర్‌కు చెందిన జి. తిరుమలకుమారి (ఎస్జీటీ)*ను ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా మండల ప్రోగ్రామ్ కన్వీనర్‌గా పనిచేసిన రాజ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో అంకితభావంతో, స్వచ్ఛందంగా వివిధ కార్యక్రమాల్లో సేవలందించిన ఉపాధ్యాయులకు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు లభించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు జాన్సన్ మాట్లాడుతూ మండలంలో గుణాత్మక విద్యను పెంపొందించేందుకు కృషిచేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషిచేసి భద్రాచలం మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.
కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్. విజయ్‌కుమార్, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి టి. రామకృష్ణ, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయబాబు, సన్మాన గ్రహీతలు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది, మండలంలోని ఉన్నత, మండల పరిషత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





జల్దా గ్రామంలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- **60 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, ఒక కారును తనిఖీ**
- **173 ఈ-చలాన్ కేసుల్లో రూ.37,941/- చెల్లింపు**
- **రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచన**
- **గంజాయి, మాదకద్రవ్యాలు, గుడుంబా, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి**
- **ఇచ్చోడా ఎస్ హెచ్ ఓ కే నరేష్ కుమార్**

ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్)

ఇచ్చోడ మండలం జల్దా గ్రామంలో ఇచ్చోడ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

తనిఖీల్లో భాగంగా 60 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, ఒక కారును తనిఖీ చేసి వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాల ఈచలాన్‌లను పరిశీలించగా 173 కేసులకు సంబంధించి రూ.37,941/ జరిమానాలు వాహనదారులు చెల్లించడం జరిగింది. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. వాహనాలకు సంబంధిత పత్రాలు, నంబర్ ప్లేట్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, గుడుంబా వంటి నిషేధిత పదార్థాలకు దూరంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. గ్రామంలో ఎలాంటి అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడా ఎస్ హెచ్ ఓ కె నరేష్ కుమార్, గుడియత్నూర్ ఎస్సై ఎల్ శ్రీకాంత్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

- **సీఎంఆర్ఎఫ్ కోసం ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించొచ్చు**

ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9వార్త న్యూస్)

నిరుపేద కుటుంబాలకు అనారోగ్య సమయంలో ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశ్యంతో బోథ్ నియోజకవర్గ పేద ప్రజలకు CMRF ద్వారా మంజూరైన రూ. 34 లక్షల 24 వేల విలువ గల చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం నెరడిగొండలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. పేద ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎంఆర్ఎఫ్ వంటి సంక్షేమ పథకాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో పేద వారు ఆసుపత్రిలో చికిత్స పొందితే ఆసుపత్రి బిల్లులను అందజేస్తే వారికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





ఘనంగా డా సర్వేపల్లి రాధకృష్ణన్ గారి జయంతి

ఆదిలాబాద్ జిల్లా : సోనాల మండలం : సెప్టెంబర్:05 (డిడి9 వార్త న్యూస్)

భారత రత్న మాజీ రాష్ట్ర పతి డా|| సర్వేపల్లి రాధకృష్ణన్ గారి జయంతి సోనాలలోని స్థానిక ఉషోదయ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవంను. ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో. స్వయం పరిపాలన దినోత్సవంలో భాగంగా. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి, పాఠాలు బోధించడం జరిగింది. మరియు పాఠశాలలోని ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి, సన్మానించనైనది . ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీ .ఎ.గంగాధర్ మాట్లాడుతు. విద్యార్థులు, ఉపాధ్యాయులపట్ల వినయం, విధేయత, గౌరవం కలిగి ఉండాలని అలాగే. ఉపాధ్యాయులు, విధ్యార్థులను, తమ, పిల్లలుగా, భావించి. ప్రేమతో, ఆప్యాయతతో, విద్యా బుద్ధులు నేర్పించాలని. తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో, విద్యార్థినీ, విద్యార్థులు, పోషకులు, ఉపాద్యాయినీ, ఉపాధ్యాయులు, పాల్గో న్నారు.



చిన్నబడిలో విద్యకు గండి.. అధికారుల మౌనం ఎందుకు..?

- **ఏడాదిగా రెగ్యులర్ టీచర్ గైర్హాజరు..?**
- **మూడు తరగతులకు ఒక్కరే.. కుంటుపడుతున్న విద్యాబోధన**
- **డీఈఓ,ఎంఈఓలకు తెలిసినా చర్యలు లేవంటూ ఆరోపణలు**
- **టీచర్ గైర్హాజరుపై 'గుట్టు' ఎందుకు..?**
- **తల్లిదండ్రులు,ఉపాధ్యాయ సంఘాల ప్రశ్న**
- **హాజరు కాకుండానే జీతం.. ప్రత్యామ్నాయంగా మరో వ్యక్తితో బోధన...?**
- **నిజానిజాలు తేల్చేందుకు సమగ్ర విచారణ చేపట్టాలంటున్న గ్రామస్తులు**

ఏటూరునాగారంక్రైం, డిడి 9వార్త (సెప్టెంబర్ 05)

ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు బలమైన పునాది వేయాల్సిన ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన కుంటుపడుతోందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. గోవిందరావుపేటలోని చిన్నబడిలో రెగ్యులర్ టీచర్ ఏడాదికాలంగా విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఒకటి నుంచి మూడు లేదా ఐదు తరగతుల విద్యార్థుల బోధనపై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చిన్నబడిలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం ఉండాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఒకే ఉపాధ్యాయుడిపై బోధన భారం పడుతోందని సమాచారం. మూడు తరగతులకు ఒక్కరే టీచర్ ఫలితంగా విద్యార్థులకు అవసరమైన స్థాయిలో పాఠాలు చెప్పలేని పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు అంటున్నారు.

రెగ్యులర్ టీచర్ ఎక్కడ...?

పాఠశాలలో పనిచేస్తున్న రెగ్యులర్ టీచర్ ఏడాదికాలంగా విధులకు రాకపోతున్నారన్న ఆరోపణలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఈ విషయం కొద్ది నెలల క్రితం జరిగిన కాంప్లెక్స్ సమావేశం సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల దృష్టికి వచ్చినట్లు సమాచారం. అక్కడి నుంచి విషయం గ్రామస్తులు, యువకులు,మహిళలు, పాత్రికేయుల దృష్టికి చేరినట్లు తెలుస్తోంది.

అధికారులకు తెలిసినా చర్యలు లేవా?

పాఠశాలలోనెలకొన్నపరిస్థితిపైమండలవిద్యాశాఖ అధికారులకుసమాచారంఉన్నప్పటికీఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికికూడా విషయం వెళ్లినప్పటికీ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచుతున్నారన్నవిమర్శలువినిపిస్తున్నాయి.

జీతం.. హాజరు.. ప్రత్యామ్నాయ బోధన...?

రెగ్యులర్ టీచర్ విధులకు హాజరు కాకపోయినా జీతం పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన స్థానంలో మరో వ్యక్తితో బోధన చేయిస్తున్నారనే సమాచారం కూడా ప్రచారంలో ఉంది. ఆ వ్యక్తికి ప్రతి నెలా సుమారు రూ.10 వేల వరకు చెల్లిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.అయితే ఈ మొత్తం ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరి ఆదేశాలతో చెల్లిస్తున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

దబ్బుల వ్యవహారంపై విచారణ అవసరం...

రెగ్యులర్ టీచర్ జీతం నుంచి కొంత మొత్తాన్ని ప్రత్యామ్నాయంగా పనిచేస్తున్న వ్యక్తికి ఇస్తున్నారనే ఆరోపణలతో పాటు,మిగిలిన మొత్తంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇవన్నీ ప్రస్తుతం వినిపిస్తున్న ఆరోపణలు మాత్రమే. వీటిలో వాస్తవమెంత? ఎవరి ప్రమేయం ఉంది? అన్నది విద్యాశాఖ అధికారులు చేపట్టే సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది.

చిన్నబడి పిల్లల భవిష్యత్తుతో చెలగాటమా?

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరై విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉంది. ముఖ్యంగా చిన్నబడుల్లో పిల్లలకు పునాది విద్య అందకపోతే వారి భవిష్యత్ విద్యపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.అలాంటి పాఠశాలపై మండల,జిల్లా విద్యాశాఖఅధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

అధికారుల మౌనం వీడాలి...

గోవిందరావుపేట చిన్నబడిలో ఉపాధ్యాయుడి హాజరు, జీతం చెల్లింపులు, ప్రత్యామ్నాయ వ్యక్తితో బోధన, అధికారుల పర్యవేక్షణ వంటి అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని తల్లిదండ్రులు,గ్రామస్తులు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నారు. విద్యార్థుల చదువుకు నష్టం జరుగుతున్నా అధికారులు మౌనం వహిస్తే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్న ఇప్పుడు తీవ్రంగా వినిపిస్తోంది.





గురువే విద్యార్థి భవిష్యత్తుకు శిల్పి..







- **భారతీ విద్యానికేతన్‌లో ఘనంగా గురుపూజోత్సవం..**
- **ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం..**

సెప్టెంబర్ 05 డిడి9 వార్త వెంకటాపురం.

వెంకటాపురం మండల కేంద్రంలోని భారతీ విద్యానికేతన్ హైస్కూల్‌లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బెజ్జెన సుజాత మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అత్యంత కీలకమని, గురువులను దైవంతో సమానంగా గౌరవించాలని సూచించారు. విద్యార్థులకు కేవలం విద్యాబోధనే కాకుండా క్రమశిక్షణ, విలువలు, ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే బాధ్యత కూడా గురువులదేనని పేర్కొన్నారు.

ఇటీవల మృతి చెందిన రూపా రెడ్డి స్కూల్స్ ఉపాధ్యాయురాలు రూప మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు.

ములుగు జిల్లా T.R.S.M.S అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల్లో గత సంవత్సరం, ఈ సంవత్సరం తమ పాఠశాలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు పురస్కారాలు అందుకోవడం పాఠశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. అవార్డు గ్రహీతలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా శాలువాలతో సన్మానించారు.

ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ.. పురస్కారాలు తమపై మరింత బాధ్యతను పెంచాయని, విద్యార్థుల ప్రతిభను వెలికితీసి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు మరింత అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.

గురువుల సేవలను కొనియాడుతూ విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో గురుపూజోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





గులాబీ గర్జన.. బైక్ ర్యాలీతో కదం తొక్కిన బి.ఆర్.ఎస్ శ్రేణులు..

- **వెంకటాపురంలో బి.ఆర్.ఎస్ బలప్రదర్శన..**
- **రెండేళ్లలోఅధికారం మనదే.. కాకలమర్రి లక్ష్మణ్ బాబు..**

సెప్టెంబరు 05 డిడి9 వార్త వెంకటాపురం.

బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం మండల కేంద్రంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా నాయకులు గుడవర్తి నరసింహమూర్తి ,మండల పార్టీ అధ్యక్షుడు గంప రాంబాబు పిలుపు మేరకు వెంకటాపురం మండల నలుమూలల నుంచి వెంకటాపురం కేంద్రానికి చేరుకున్న కార్యకర్తలు కేంద్రంలోని నూగురు పెట్రోల్ బంక్ నుంచి శివాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పేరుతో ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఆరోపించారు. వృద్ధులు, మహిళలు, రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వెంకటాపురం మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో సమీకృతం కావడం పార్టీ బలాన్ని చాటుతోందన్నారు. భద్రాచలం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరఫున గెలిచిన అభ్యర్థి కాంగ్రెస్‌లో చేరడం బాధాకరమన్నారు. రానున్న రెండేళ్లలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అధికార పార్టీ నాయకుల అండదండలతో బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలపై వివక్ష..

మండల అధ్యక్షుడు గంప రాంబాబు మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకుల అండదండలతో కొందరు అధికారులు బీఆర్ఎస్ కార్యకర్తల పట్ల వివక్ష చూపుతున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన అనంతరం పార్టీ కార్యకర్తలు, అభిమానులను ఆదుకునే బాధ్యత తీసుకుంటామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడపర్తి నరసింహమూర్తి, బట్ట నాగేంద్ర, మానే రామకృష్ణ, చెరుకూరి సతీష్, మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

3 గంటలు ఎండలో నిలబడి ట్రాఫిక్ సమస్య తీర్చిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- నా ఆరోగ్యం కన్నా ప్రజల సౌకర్యాలే ముఖ్యం
- ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో తీరిన ట్రాఫిక్ కష్టాలు
- కుప్టి రోడ్డు వద్ద ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్ జిల్లా : బోథ్ మండలం : సెప్టెంబర్:05 (డిడి9 వార్త న్యూస్)

నెరడిగొండ మండలంలోని కుప్టి బ్రిడ్జి సమస్య కారణంగా రాత్రి నుంచి దాదాపు 10 కిమి. బోథ్ ఎక్స్ రోడ్డు నుంచి ఇచ్చోడ వరకు నిలిచిపోయిన భారీ వాహనాల వద్దకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వయంగా చేరుకున్నారు.
ఆరోగ్యం బాగలేకపోయిన ప్రజల ఇబ్బందులు చూసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ 3 గంటల పాటు ఎండలో నిలబడి ట్రాఫిక్ సమస్యకు తాత్కాలిక మార్గం ఎమ్మెల్యే ప్రారంభించారు. గంటల తరబడి నిలిచి ఉన్న వాహనదారులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో ఊరట లభించింది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మీడియాతో మాట్లాడుతూ... హైవే పై అనేక టోల్ ప్లాజా లు ఏర్పాటు చేసి అమాయకుల రక్తం తాగుతున్నారు తప్ప రోడ్ల సౌకర్యాలు మాత్రం మెరుగుపరచట్లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి రాష్ట్రాల రోడ్లకు వేల కోట్లు కేటాయిస్తున్నారు కానీ, కేంద్ర మంత్రి తెలంగాణ పక్కనే నాగపూర్ లో ఉన్న పట్టించుకోవడం లేదన్నారు. శాశ్వత పరిష్కారం రాకపోతే కచ్చితంగా రహదారి దిగ్బంధం చేస్తామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హెచ్చరించారు.




1000 రోజుల ప్రజాపాలన సంబరాలు బోథ్ కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

- 1000 రోజుల ప్రజా పాలన సంబరాల్లో భాగంగా ఆదిలాబాద్ బైక్ ర్యాలీకి బయలుదేరిన బోథ్ మండల కాంగ్రెస్ నాయకులు
- మేరుగు భోజన్న బోథ్ మండల అధ్యక్షులు

ఆదిలాబాద్ జిల్లా : బోథ్/ సోనాల మండలం : సెప్టెంబర్:05 (డిడి9 వార్త న్యూస్)

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన సంబరాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈరోజు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో పాల్గొనేందుకు బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీగా బయలుదేరారు.
బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేరుగు భోజన్న, ఎ ఎం సి చైర్మన్ సత్యనారాయణ,ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీకి తరలివెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు నాయకులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బోథ్ ఎ ఎం సి చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టి పి సి సి రాష్ట్ర SC సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, జిల్లా సెక్రటరీ వినయ్ కుమార్, బి ఎల్ ఏ2 విజయ్, బి ఎల్ ఏ2 కోమారి దయాకర్, బోథ్ ఉప సర్పంచ్ విజయ రాజా రెడ్డి, వార్డు మెంబర్ సోహెల్తో పాటు నాయకులు దినేష్ రెడ్డి, రహీంద్దీన్, బుచ్చన్న, రవి, షేక్ అబ్రర్, యూసఫ్, కౌసర్, షామెందర్, రమణ, ఆశిష్ రెడ్డి, అబూద్, అలీం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేరుగు భోజన్న మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో బోథ్ మండల కాంగ్రెస్ కుటుంబం ఉత్సాహంగా భాగస్వామ్యం అవుతోందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తారని తెలిపారు.
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే భారీ బైక్ ర్యాలీని విజయవంతం చేసేందుకు బోథ్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారని ఆయన తెలిపారు.



బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసిన ఇచ్చోడ పోలీసులు

ఆదిలాబాద్ బ్యూరో : (డిడి9 వార్త న్యూస్)

ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ MJP బాలుర పాఠశాలలో పేద విద్యార్థుల సంక్షేమం పేరుతో విరాళాలు సేకరించి, అనంతరం రూ.50,000/ డిమాండ్ చేస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులను బెదిరింపులకు గురిచేసిన వ్యక్తిని ఇచ్చోడ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం నర్సాపూర్ MJP బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ నందా సింగ్ ఠాకూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు కొట్టూరు ప్రవీణ్, s/o రాము నారాయణ, వయస్సు 35 సంవత్సరాలు, TGVP విద్యార్థి సంఘం నాయకుడిగా ఉన్నట్లు తెలిపారు.
నిందితుడు గతంలో పేద విద్యార్థుల సంక్షేమం కోసం విరాళాలు కావాలని పాఠశాలను సందర్శించేవాడు. దీంతో ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు రూ.500 నుంచి రూ.1,000 వరకు విరాళాలు అందించారు. అనంతరం మరోసారి పాఠశాలకు వచ్చిన నిందితుడు రూ.50,000/ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే డబ్బులు ఇచ్చేందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నిరాకరించడంతో, పాఠశాల మరియు ఉపాధ్యాయులపై సోషల్ మీడియాలో తప్పుడు, పరువు నష్టం కలిగించే వార్తలు ప్రచారం చేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రిన్సిపాల్‌ను బెదిరిస్తూ ఉద్యోగం కోల్పోయేలా చేస్తానని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు తెలిపారు.
ఈ ఫిర్యాదు ఆధారంగా ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 438/2026, సెక్షన్ 308(5) BNS కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు కోతూరి ప్రవీణ్ @ కొట్టూరు ప్రవీణ్ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.
ఇచ్చోడ SHO K. నరేష్ కుమార్ మాట్లాడుతూ.. బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ లేదా డబ్బుల కోసం ఒత్తిడి చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజలు ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

ఘనంగా బంజారా తీజ్ పండుగ

- దేవుళనాయక్ తండా గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమం .

ఆదిలాబాద్ జిల్లా :సోనాల మండలం :సెప్టెంబర్:05 (డిడి9 వార్త న్యూస్)

సోనాల మండలం లోని దేవుళనాయక్ తండా పార్థి బి జగదాంబ దేవిఆలయంలో బంజారా తీజ్ పండగను ఘనంగా జరుపుకున్నారు ప్రత్యేక పూజలు చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ బాబూసింగ్.. గ్రామ పెద్దలు జాదవ్ రాంకిసాన్ నాయక్.. రాథోడ్ పాండురంగ్ కారోబారి జాదవ్ బావురావ్ రాథోడ్ మంగులాల్, శిలా బాయి, శ్రీ సేవాదాస్ యూత్..గ్రామస్తులు పాల్గొన్నారు



ఉనికి కోసమే బీఆర్ఎస్ విమర్శలు: మానాల మోహన్ రెడ్డి

- హామీల అమలుపై బహిరంగ చర్చకు సిద్ధం

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డిడీ9 వార్త):



తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆధారరహిత విమర్శలు చేస్తున్నారని మాజీ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాల కల్పన వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలు.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అమలు చేసిన హామీలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలు మానుకుని, అభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

గురువులకు వందనం.. కేర్ కళాశాలలో విద్యావేడుక!

- అధ్యాపకులకు ఘనంగా సత్కారం

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డిడీ9 వార్త):

నిజామాబాద్ నగరంలోని కేర్ డిగ్రీ కళాశాల ప్రాంగణం ఉపాధ్యాయ దినోత్సవ శోభతో వికసించింది. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల యాజమాన్యం, విద్యార్థులు గురువులను ఘనంగా స్మరించుకున్నారు. కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్, ప్రిన్సిపాల్ నరేష్‌ల సమక్షంలో లెక్చరర్లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వేడుకల్లో భాగంగా చేపట్టిన స్వయం పరిపాలన కార్యక్రమంలో విద్యార్థులే అధ్యాపకులుగా మారి ఉత్సాహంగా బోధన చేశారు. అత్యుత్తమ బోధనా పటిమ చూపిన శేఖర్, దేవికలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. విద్యార్థులు గురువుల పట్ల చూపిన భక్తిశ్రద్ధలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలో వైస్ ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్, కళాశాల బాధ్యులు సందేశ్, కొయ్యాడ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



చౌట్‌పల్లి పాఠశాలలో వేడుకగా ఉపాధ్యాయ దినోత్సవం

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డిడీ9 వార్త):


చదువు చెప్పిన గురువులను స్మరించుకుంటూ పూర్వ విద్యార్థులు తమ కృతజ్ఞత చాటుకున్నారు. కమ్మర్ పల్లి మండలంలోని చౌట్‌పల్లి పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 198081 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల మిత్రబృందం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు నేర ఆంధ్రయ్య మాట్లాడుతూ.. విద్యార్థులను భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరవరానిదన్నారు. గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థుల చొరవను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెహబూబ్, పూర్వ విద్యార్థుల ప్రతినిధులు ముక్క అంజయ్య, కృష్ణమురళి, పెద్ది దామోదర్ గౌడ్, రాజేందర్ గౌడ్, సీఆర్‌పీ అంజయ్య, ఇన్‌చార్జి హెచ్ఎం కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




ఇచ్చోడలో వాటర్ ట్యాంక్ ఎక్కి మహిళ హల్‌చల్

- వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కడంతో స్థానికుల్లో ఆందోళన
- కొద్దిసేపు ఉత్కంఠ కారణాలపై ఆరా

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ : (డిడి9 వార్త న్యూస్)



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో శనివారం ఓ మహిళ వాటర్ ట్యాంక్ ఎక్కడంతో కలకలం రేగింది. మహిళ ట్యాంక్‌పైకి ఎక్కడాన్ని గమనించిన స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ఈ ఘటనతో వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతంలో కొద్దిసేపు ఉత్కంఠభరిత పరిస్థితి నెలకొంది.మహిళ ట్యాంక్‌పై ఉండటంతో ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న పలువురు అక్కడికి చేరుకోవడంతో పరిసరాల్లో జనాలు గుమిగూడారు. అయితే మహిళ వాటర్ ట్యాంక్ ఎక్కడానికి గల కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. ఆమె ఎందుకు ట్యాంక్‌పైకి ఎక్కింది? ఏదైనా సమస్య కారణంగా ఈ చర్యకు పాల్పడిందా? అనే విషయాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన కారణాలు, మహిళ వివరాలు అధికారుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. పూర్తి సమాచారం అందిన తర్వాత ఘటనపై మరింత స్పష్టత రానుంది.

కోటకే గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- సోనాల మండలంలో ఉదయం 5 గంటల నుంచి పోలీసుల నిర్బంధ తనిఖీలు
- 47 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, ఒక మ్యాక్స్ వాహనం తనిఖీ
- 5 నంబర్ ప్లేట్ లేని వాహనాలు స్వాధీనం.
- గంజాయి, మాదకద్రవ్యాలు, గుడుంబా, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచన
- రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి – హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి
- బోథ్ సిఐ డి గురుస్వామి

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం:సెప్టెంబర్ 05 :(డి డి 9 వార్తా న్యూస్)

బోథ్ సిఐ డి గురుస్వామి ఎస్సై వి పురుషోత్తం ఆధ్వర్యంలో సోనాల మండలంలోని కోటకే గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఉదయం 5 గంటల నుంచి వందమంది పోలీసుల విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.
ఈ సందర్భంగా 47 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, ఒక మ్యాక్స్ వాహనాన్ని తనిఖీ చేసి వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగానే దాదాపు 174 ఈ చలాన్ కేసులలో రూ 41,315/ చలాన్లను వాహనదారులు చెల్లించడం జరిగింది అని తెలిపారు. ఐదు నంబర్ ప్లేట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.
అదేవిధంగా యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, గుడుంబా వంటి నిషేధిత పదార్థాలకు దూరంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీసులు సూచించారు. గ్రామంలో ఎలాంటి అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బోథ్ సీఐ డి. గురుస్వామి, బోథ్ ఎస్సై వి. పురుషోత్తం, బజార్హత్నూర్ ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమం

ఆదిలాబాద్ జిల్లా : సోనాల మండలం : సెప్టెంబర్:05(డిడి9 వార్త న్యూస్)

జూన్ 25, 2026 నుండి భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటా ఇంటింటా లేకుండా పూర్తిచేసిన జూన్ 25, 2026 నుండి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) నిర్వహిస్తుంది. 17.08.2026 న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మీ పేరు లేకపోతే, బూత్ స్టాయి అధికారి (బి ఎల్ ఓ) / ఏ ఈ ఆర్ ఓ /ఈ ఆర్ ఓ ను సంప్రదించండి. 17.08.2026 నుండి 16.09.2026 వరకు క్లెయిములు & అభ్యంతరాలు తెలుపవచ్చు.
ఫారం6
మీకు కొత్త ఓటరు అయితే 18 సంవత్సరాలు నిండినట్లయితే, ఓటరుగా నమోదు కోసం ఫారం6 నింపి సమర్పించండి.
ఫారం7
మీరు/చనిపోయిన లేదా ఇతర వివరాల సవరణపై అభ్యంతరాలు తెలపడానికి.
ఫారం8
మీ మొబైల్ నంబర్, ఇమెయిల్, ఫోటో వంటి వివరాలను ఓటర్ గుర్తింపు పత్రంలో చేర్చించడానికి
గమనిక: మీ బాధ్యత.. ఓటరు జాబితాలో మీ వివరాలు చెక్ చేసుకోండి - సరైన ఓటు హక్కును వినియోగించుకోండి.కార్యక్రమంలో సోనాల ఏం ఆర్ ఓ ఎ మల్లేష్,సూపర్ వైజర్ సునీత,ఏం పి డి ఓ రత్నాకర్ రావ్, జెడ్ పి ఓ యాష్మిన్,బి ఎల్ ఓ మన్సూర్ నాగరాణి, అజారోద్దీన్, కృష్ణవేణి,గీత,సాయి అశోక్ ,ఓటర్లు గ్రామస్తులు పాల్గొన్నారు




లారీ, సిమెంట్ ట్యాంకర్ ఢీ 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్

ఆదిలాబాద్ జిల్లా : బోథ్ మండలం : సెప్టెంబర్:05 (డిడి9 వార్త న్యూస్)

ఇచ్చోడ, నేరేడిగొండ మండలాల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నేరేడిగొండ మండలం కుప్టి బ్రిడ్జిపై నిన్న అర్ధరాత్రి టమాటా లోడ్‌తో వెళ్తున్న లారీ, సిమెంట్ మిక్సర్ ట్యాంకర్ ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి.ఇప్పటికే ఆ బ్రిడ్జి ఒక వైపు భారీ గుంత పడటంతో రాకపోకలను నిలిపివేసి, రెండో వైపు వన్ వే ద్వారా మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. అయితే అదే వన్ వే బ్రిడ్జిపై ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో రహదారి పూర్తిగా దిగ్బంధమైంది. దీంతో ఇరువైపులా సుమారు పది కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





ఆర్మూర్ లో గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

- **పోలీస్ కమిషనర్ పి. సాయిచైతన్య పిలుపు**
- **నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టీకరణ**

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

ఆర్మూర్‌లో గణేశ్ చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపునిచ్చారు. శనివారం ఆర్మూర్ క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ.. గణేశ్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. డీజేల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు, శబ్ద పరిమితి పాటించాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జన ఊరేగింపులో రెచ్చగొట్టే నినాదాలు చేయవద్దని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఉత్సవాలు ప్రశాంతంగా పూర్తయ్యేలా సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన మాలవ్య, ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్య నారాయణ గౌడ్, రూరల్ సీఐ జాన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోని లహరి, వైస్ చైర్మన్ కాటేపల్లి వెంకట్ రెడ్డి, ఎస్ఐలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



ప్రజా కంటక కాంగ్రెస్ పాలనపై పోరుబాట

- **నిజామాబాద్‌లో బీఆర్ఎస్ భారీ బైక్ ర్యాలీ**
- **ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్**

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేసిందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బిగాల గణేష్ విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై శనివారం నిజామాబాద్ నగరంలో యువత, పార్టీ శ్రేణులతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత కలెక్టర్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ఈ నిరసన ప్రదర్శనలో వెయ్యికి పైగా బైక్‌లతో యువకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ పూలాంగ్, వర్ని, ఖిల్లా ఎక్స్ రోడ్లు, పవన్ టాకీస్, నెహ్రూ పార్క్, బస్ స్టాండ్ మీదుగా సాగి తిరిగి పాత కలెక్టర్ గ్రౌండ్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా బిగాల గణేష్ మాట్లాడుతూ.. 6 గ్యారెంటీలు, 420 హామీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుతం ఆ పార్టీ పాలన అట్టర్ ఫ్లాప్‌గా మారిందని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ వంటి కీలక హామీలను పక్కనపెట్టి నిరుద్యోగ యువతను నట్టేట ముంచిందని మండిపడ్డారు. నూతన ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ ఇప్పటివరకు వేచి చూశారని, కానీ ప్రజా సమస్యలు తీవ్రమవుతుండటంతో వీధిపోరాటాలకు శ్రీకారం చుట్టామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ హామీలను తక్షణమే నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు సత్య ప్రకాష్, సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, జగత్ రెడ్డిలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.







22-ఏ భూముల పీటముడిపై సమరశంఖం

- **22-ఏ భూముల పీటముడిపై సమరశంఖం**
- **ఇందిరాపార్క్‌లో భజపా మహాదీక్ష**
- **హాజరైన ఇందూరు శ్రేణులు**

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

అమాయక ప్రజలు, రైతుల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి వేధింపులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై భారతీయ జనతా పార్టీ సమరశంఖం పూరించింది. నిరుపేదలు, రైతుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో చేపట్టిన మహాదీక్షకు నిజామాబాద్ జిల్లా బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి.

ప్రభుత్వానివి ప్రజావ్యతిరేక విధానాలు: ధనపాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో తరలివెళ్లిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు దీక్షకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన చట్టాలను దుర్వినియోగం చేస్తూ, పేదల స్వార్జిత భూములను నిషేధిత జాబితాలో చేర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ మూర్ఖత్వానికి నిదర్శనమని విమర్శించారు. బాధిత రైతులకు, భూ యజమానులకు పూర్తిగా న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, ప్రభుత్వ మెడలు వంచి తీరుతామని హెచ్చరించారు.

రియల్ ఎస్టేట్ బ్రోకర్ల కోసమే: పైడి రాకేష్ రెడ్డి

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. 22ఏ నిబంధన కేవలం రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ప్రయోజనాల కోసమే ఉపయోగపడేలా ఉందని ఆరోపించారు. హైడ్రా, మూసీ పరిరక్షణ పేర్లతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సామాన్య ప్రజలకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పాలనను వదిలేసి రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోదాకు తగదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.











ఐదేళ్ల లోపు పిల్లల మరణాల నివారణకు కృషి చేయాలి

- **డీఎంహెచ్ఓ బి.రాజశ్రీ**

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

ఐదేళ్ల లోపు పిల్లల మరణాల రేటును తగ్గించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 5 సంవత్సరాల లోపు పిల్లల మరణాలపై డొంకేశ్వర్, కిసాన్ నగర్, పాన్గల్లి, పోచంపాడు, రెంజల్, జక్రంపల్లి, వినాయక్ నగర్, గోవింద్ పెట్, ఇందల్వాయి, వేల్పూర్, మోస్రాతో సహా 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. గర్భిణులు, చిన్నపిల్లల్లో ప్రమాదకర లక్షణాలను ముందే గుర్తించి, తగిన వైద్యం అందించాలని సూచించారు. ప్రసవానంతరం బాలింతలను క్రమం తప్పకుండా ఇంటి వద్ద ఫాలోఅప్ చేయాలని, ఎంసీపీ కార్డులను ప్రతి నెలా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. గర్భిణులకు కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు తప్పనిసరిగా జరిగేలా చూడాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే, వెళ్లే బాలింతల సమాచారాన్ని నిరంతరం సేకరిస్తూ పర్యవేక్షించాలన్నారు. బిడ్డకు, బిడ్డకు మధ్య కనీసం మూడేళ్ల వ్యవధి ఉండేలా తల్లులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ఇందుకోసం 'అంతర', ఐయూసీడీ, పీపీఐయూసీడీ వంటి తాత్కాలిక లేదా శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన పెంచాలన్నారు. రక్తహీనత నివారణకు, తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నిరూప రెడ్డి, డాక్టర్ నవీన్ మాట్లాడుతూ.. ప్రసవించిన గంటలోపే శిశువుకు మొర్రిపాలు పట్టించేలా తల్లులకు వివరించాలన్నారు. ఏడో నెల నుంచి పిల్లలకు ఇచ్చే అనుబంధ ఆహారంపై బాలింతలకు సరైన మార్గదర్శనం చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం. అశోక్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ఉమా, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ వనిత, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నవీన్, డాక్టర్ నిరూప రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ రవీందర్, డాక్టర్ విద్య, డాక్టర్ సికందర్ నాయక్, డాక్టర్ నవ్య, డాక్టర్ శేఖర్, డీహెచ్ఈలు వెంకటేశ్వర్లు, మనోహర్, సిడిపిఓలు, పిహెచ్‌సిల వైద్యాధికారులు, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.





కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ విమర్శలు అర్థరహితం.

- **మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి**

శంకర్ పల్లి సెప్టెంబర్ 05(డీడీ9 వార్త):

కాంగ్రెస్ ప్రభుత్వం దగా ప్రభుత్వం అంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రాజకీయ దురుద్దేశంతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమం-అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన వారు.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. శంకర్‌పల్లి మండలంలో కూడా సీఎం రేవంత్ రెడ్డి సహకారం తో ఎమ్మెల్యే యాదయ్య అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, గ్రామాలు, మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎవరిది మాటల ప్రభుత్వం, ఎవరిది చేతల ప్రభుత్వమో ప్రజలకు తెలుసు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన నిలిచి పనిచేస్తోంది. ప్రతిపక్షాల విమర్శలకు ప్రజల అభివృద్ధే మా సమాధానం అని బొల్లారం వెంకటరెడ్డి స్పష్టం చేశారు.





అడవి చెట్లు నరికివేతపై కేసు నమోదు

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

అటవీ భూముల్లో అక్రమంగా చెట్లను నరికివేసిన సంఘటనపై ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ భట్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎఫ్ఆర్ఓ అందించిన వివరాల ప్రకారం.. ఈ నెల 4న ఉదయం 10:30 గంటలకు ఇందల్వాయి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రభాకర్, గన్నారం బీట్ ఆఫీసర్ నాగేశ్‌ల బృందం గన్నారం గ్రామంలోని శివాలయం పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో మేగ్యా నాయక్ తాండా రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దులోని అటవీ భూమిలో గన్నారం గ్రామానికి చెందిన కుంట లక్ష్మారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా 5 టేకు, 3 చెన్నంగి చెట్లను నరికివేసినట్లు అధికారులు ఆధారాలతో సహా గుర్తించారు. అనుమతి లేకుండా చెట్లను నరకడం నేరమని స్పష్టం చేస్తూ, జిల్లా అటవీ శాఖాధికారి, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ల ఆదేశాల మేరకు 1967 అటవీ చట్టం ప్రకారం లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అక్రమంగా చెట్లను నరికినా, అటవీ సంపదకు భంగం కలిగించినా లేదా వన్యప్రాణులకు హాని తలపెట్టినా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

బషీరాబాద్ లో గురువులకు ఘన సన్మానం

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్మర్ పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలోని యూపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయులను గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. శనివారం నిర్వహించిన ఈ వేడుకల్లో సర్పంచ్ జమున మహేష్, ఉప సర్పంచ్ భూమేష్, పాలకవర్గ సభ్యులు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి ఆంధ్రయ్యను గ్రామ పంచాయతీ ప్రతినిధులు ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జమున మహేష్ మాట్లాడుతూ.. సమాజ వికాసానికి, భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తూ వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న గురువుల సేవలను స్మరించుకోవడం, వారిని గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ వేడుకల్లో పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు రమేష్, రాజు, శేఖర్, శ్రీనివాస్, లక్ష్మి రవి, చిలివేరి లక్ష్మి, విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు పృథ్వీ రాజ్, కోశాధికారి ఆనంద్, గంగాధర్‌లతో పాటు ఆయా పాఠశాలల, అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టురట్టు : ఇద్దరి అరెస్ట్

- **వివరాలు వెల్లడించిన సీపీ సాయి చైతన్య**

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):



బోధన్ పట్టణంలో నకిలీ ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలను తయారుచేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. రాకాసిపేట్‌లోని ఓ మీసేవ కేంద్రం నిర్వాహకులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున నకిలీ పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య తెలిపారు. సీపీ తెలిపిన వివరాల ప్రకారం... రాకాసిపేట్‌లోని 'సహారా మీసేవ' కేంద్రంలో అక్రమంగా నకిలీ ప్రభుత్వ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ శ్రీశైలం, సీసీఎస్ సిబ్బంది, బోధన్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మీసేవ ఆపరేటర్ షేక్ వసీమ్, సెంటర్ యజమాని మహమ్మద్ ముక్రమ్‌లు సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గత రెండేళ్లుగా ఈ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేలింది. షాదీ ముబారక్, జనన ధ్రువీకరణ పత్రాలు, టీసీలు, బోనఫైడ్‌లను నకిలీవి తయారుచేసి, వాటిపై నకిలీ రబ్బర్ స్టాంప్‌లు వేసి అసలైనవిగా నమ్మించేవారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ. 5 నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నకిలీ పత్రాలను పలువురు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు ఉపయోగించినట్లు తేలింది. ఘటనా స్థలంలో మీసేవ ఆపరేటర్ షేక్ వసీమ్, యజమాని మహమ్మద్ ముక్రమ్ లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5 నకిలీ మీసేవ సర్టిఫికెట్లు, 22 జనన ధృవీకరణ జిరాక్స్ పత్రాలు, 38 ఖాళీ ఒరిజినల్ మీసేవ పేపర్లు, 13 నకిలీ టీసీలు, బోనఫైడ్లు, ఒక నకిలీ రబ్బర్ స్టాంప్, హెచ్‌పీ ల్యాప్‌టాప్, క్యానన్ కలర్ ప్రింటర్, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బోధన్ టౌన్ ఇన్స్పెక్టర్ వెంకట నారాయణ, ఎస్ఐ రామ్ ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ చూపిన సీసీఎస్, బోధన్ పోలీసు అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అభినందించారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం

- **బోధన్ లో బీఆర్ఎస్ వి ఆధ్వర్యంలో ర్యాలీ**

బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ బోధన్ నియోజకవర్గ ఇంచార్జి అయేషా ఫాతిమా అమెర్ మండిపడ్డారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో శనివారం బోధన్ పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థుల, నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ విజయకుమారికి సమర్పించారు. ఈ సందర్భంగా అయేషా ఫాతిమా అమెర్, బిఆర్ఎస్వి కన్వీనర్ వడ్ల సతీష్ చారిలు మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఉస్మానియా, తెలంగాణ విశ్వవిద్యాలయాలకు భారీగా నిధులు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, ఆ హామీని నీరుగార్చారని ధ్వజమెత్తారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన అత్యంత ఆదరణ పొందిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్షిప్లు, రూ.5 లక్షల సహాయం, ఉచిత స్కూటీలు, ప్రతి నెల రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పారని దుయ్యబట్టారు. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను, స్కాలర్షిప్లను తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల చెల్లింపుపై స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలోబోధన్ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, కౌన్సిలర్లు మోబీన్, గుమ్ముల అశోక్ రెడ్డి, అజర్, లక్ష్మిలతో పాటు బిఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





సంపన్నుల కొమ్ముకాస్తూ.. పేదలను వంచిస్తున్నారు

- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎన్పీఆర్డీ ధ్వజం**
- **బోధన్లో ఎన్పీఆర్డీ సదస్సు ప్రారంభం**

బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉధృతం చేస్తామని పలువురు ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం బోధన్ పట్టణంలోని అప్నా గార్డెన్లో మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు టీ.జ్యోతి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మతోన్మాద విధానాలతో దేశంలో అసమానతలు సృష్టిస్తోందని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే కొత్త పథకాలను తెచ్చి రాష్ట్రాలపై భారం మోపుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ఏనాడూ సంబంధం లేని బీజేపీ, ఆనాటి చారిత్రాత్మక పోరాటాన్ని హిందూ ముస్లింల వివాదంగా చిత్రీకరించేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. రాబోయే 2027 జనాభా లెక్కల్లో 21 రకాల వైకల్యాల వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో లబ్ధిదారులను మోసం చేశారని, వికలాంగుల పింఛన్ల పెంపు కోసం దరఖాస్తుల స్వీకరణ పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర వైకల్యం ఉన్న వారికి నెలకు రూ.15 వేల అలవెన్స్ ఇవ్వాలని, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం, ప్రశ్నించే గొంతులపై నిర్బంధాలు మోపుతోందని జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ.రమేష్ బాబు విమర్శించారు. ఉచిత విద్య, వైద్యం పేద ప్రజల ప్రాథమిక హక్కు అని, వాటిని కాపాడుకునేందుకు క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తామని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు జె.రాజు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు గైని రాములు, కార్యదర్శి యేశాల గంగాధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.కవిత, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నజీర్, రాష్ట్ర నాయకులు ఉపేందర్, బాలేశ్వర్, అరిఫా, బస్వరాజు, రాధమ్మ, భుజంగారెడ్డితో పాటు వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



చౌట్పల్లిలో పోలీస్ కళా బృందం ప్రదర్శన

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

గ్రామాల్లో నేరాల నియంత్రణ, చట్టాలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం కమ్మర్ పల్లి మండలం చౌట్పల్లిలో పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ఆటపాటలు, నాటికల ద్వారా సైబర్ మోసాలు, రోడ్డు భద్రతా నియమాలు, మహిళలు, పిల్లల రక్షణ చట్టాలపై ప్రజలకు ఆకట్టుకునేలా వివరించారు. కార్యక్రమంలో కమ్మర్పల్లి ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ... ప్రజల్లో శాంతిభద్రతలపై నమ్మకం పెంపొందించేందుకే ఈ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై భగ్గుమన్న బీఆర్ఎస్

- **మియాపూర్ జేపీఎన్ నగర్లో భారీ ధర్నా..**
- **కాంగ్రెస్ హామీలపై బాకీ కార్డుల పంపిణీ**
- **ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి**
- **మాధవరం కృష్ణారావు**
- **ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం**
- **-మారబోయిన రవి కుమార్ యాదవ్**

శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 5,(డిడి9 వార్త):

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో మియాపూర్ జేపీఎన్ నగర్లో భారీ నిరసన కార్యక్రమం శనివారం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు, కూకట్పల్లి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇన్చార్జ్ మాధవరం కృష్ణారావు సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు గోపరాజు శ్రీనివాస్ రావు, రోజా, BSN కిరణ్, శివరాజ్ ముదిరాజ్ నాయకత్వంలో జరిగిన నిరసన కార్యక్రమానికి కూకట్ పల్లి ఎం ఎల్ ఏ మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, పెండింగ్లో ఉన్న పథకాలు, హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు.

ప్రజలకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీలను గుర్తు చేసేందుకే బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

ప్రజల ఆర్థిక ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజలకు న్యాయంగా అందాల్సిన ప్రయోజనాలను వెంటనే అందించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఈ సందర్భంగా శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, పెండింగ్ సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగా రావు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, మాజీ కార్పొరేటర్ నవతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



నిజామాబాద్ ఆస్పత్రిలో చిన్నారి కిడ్నాప్

- **- చాక్లెట్ కొనిస్తానని రెండున్నరేళ్ల బాలుడిని ఎత్తుకెళ్లిన మహిళ**
- **- మాతా శిశు సంరక్షణ కేంద్రంలో కలకలం**
- **- సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసుల గాలింపు**

నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న మాతా శిశు సంరక్షణ కేంద్రంలో శనివారం చిన్నారి కిడ్నాప్ సంఘటన తీవ్ర కలకలం రేపింది. చాక్లెట్ కొనిస్తానని ఆశ చూపిన ఓ అపరిచిత మహిళ రెండున్నరేళ్ల బాలుడిని ఎత్తుకెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండలం నాగపూర్ గ్రామానికి చెందిన దంపతులు తమ ఇద్దరి పిల్లలతో కలిసి చికిత్స నిమిత్తం శనివారం ఉదయం నిజామాబాద్లోని మాతా శిశు కేంద్రానికి వచ్చారు. తల్లిదండ్రులు ఆస్పత్రి లోపల వైద్యులతో మాట్లాడుతుండగా వారి ఇద్దరు పిల్లలు ఆవరణలో ఆడుకుంటున్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న ఓ అపరిచిత మహిళ, చిన్న కుమారుడైన వేదాంష్ వద్దకు వచ్చి చాక్లెట్ కొనిస్తానని నమ్మించి తన వెంట తీసుకెళ్లిపోయింది. వైద్య పరీక్షల అనంతరం బయటకు వచ్చిన తల్లిదండ్రులు తమ కుమారుడు వేదాంష్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వెంటనే అత్యవసర నంబర్ 112కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే మాతా శిశు కేంద్రానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రిలోని సీసీటీవీ ఫుటేజ్ను పరిశీలించగా.. ఓ మహిళ బాలుడిని తీసుకెళ్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. సదరు దృశ్యాల ఆధారంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేసి, ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గతంలో ఇదే ఆస్పత్రి ఆవరణలో నవజాత శిశువు మృతదేహం డ్రైనేజీలో లభించిన ఘటన మరువక ముందే.. ఇప్పుడు ఏకంగా రెండున్నరేళ్ల చిన్నారి కిడ్నాప్కు గురికావడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ కిడ్నాప్ సంఘటనకు సంబంధించిన మహిళ, బాలుడు వేదాంష్ ఎవరికైనా కనిపిస్తే వెంటనే 87126 59837 ఫోన్ నంబర్కు గానీ, సమీపంలోని పోలీస్ స్టేషన్లో గానీ సమాచారం అందించాలని బాధితులు, పోలీసులు కోరారు. సమాచారాన్ని వీలైనంత ఎక్కువగా షేర్ చేసి చిన్నారి ఆచూకీ కనుగొనడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: మోబిన్ ఖాన్

- **సాటాపూర్ చౌరస్తా నుండి రెంజల్ వరకు భారీ బైక్ ర్యాలీ**

బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా రెంజల్లో విజయోత్సవ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. రెంజల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోబిన్ ఖాన్ ఆధ్వర్యంలో నాయకులు సాటాపూర్ చౌరస్తా నుంచి రెంజల్ గ్రామం వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోబిన్ ఖాన్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం గత వెయ్యి రోజులలో సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. దళారులు లేకుండా ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. రెంజల్ మండలంలోనే 900 పైగా ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, వెయ్యి కి పైగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరిట నిధులు వృధా చేశారని విమర్శించారు. అభివృద్ధిపై చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే షకీల్కు సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి రెడ్డి, కార్తీక్ యాదవ్, సురేందర్ గౌడ్, సాయిలు, ఇందిరా రెడ్డి, రాములు, ఎం.ఎల్.రాజు, సర్పంచులు ధనుంజయ్, మాధవ్, భానుచందర్, ఉప సర్పంచులు అఫ్జల్ ఖాన్, శ్రీకాంత్, కుద్దుస్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన టీజీవీపీ నాయకులు

బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 05డీడీ9 వార్త):

బోధన్ మండలంలోని బిక్నెల్లి ప్రభుత్వ పాఠశాలను శనివారం తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు సందర్శించారు. టీజీవీపీ బోధన్ డివిజన్ అధ్యక్షుడు మీసాలె నాగేష్ పాఠశాలలో మౌలిక వసతులు, విద్యా సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో సదుపాయాలు మెరుగుపరచాలని అధికారులను కోరారు. విద్యార్థుల హక్కుల కోసం టీజీవీపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.